తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
TELTEL/2023/88710
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
వరంగల్ | ఆదివారం-11- మే - 2025 | సంపుటి : 2 | సంచిక : 350 | పేజీలు - 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in


# దేశ రక్షణ కోసం అన్ని విధాలుగా సిద్ధంగా ఉన్నాం: భారత ఆర్మీ





ఢిల్లీ (తెలంగాణ ముచ్చట్లు)

భారత్, పాకిస్తాన్‌ల మధ్య కాల్పుల విరమణకు అంగీకారం కుదిరింది. శనివారం సాయంత్రం ఇరు దేశాలు కాల్పుల విరమణకు అంగీకరించినట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ట్వీట్ చేయగా, దీన్ని భారత కూడా ధృవీకరించడంతో ఇరు దేశాల మధ్య చోటు చేసుకున్న ఉద్రిక్తతలకు ముగింపు దొరికింది. అనంతరం ఇండియన్ ఆర్మీ.. ప్రెస్ మీట్ నిర్వహించింది. 'దేశ రక్షణ కోసం అన్ని విధాలుగా సిద్ధంగా ఉన్నాం. ఇరు దేశాల యుద్ధంలో పాక్ ఆర్మీకి భారీ నష్టం వాటిల్లింది. పాక్ తప్పుడు కథనాలు ప్రచారం చేసింది. భారత్ ఎయిర్ బేస్ పై దాడి చేసినట్లు అసత్య ప్రచారం చేశారు.

మిగతా 2లో..

# కాల్పుల విరమణకు భారత్-పాక్ అంగీకరించాయి: డొనాల్డ్ ట్రంప్



- ట్రంప్ ప్రకటనలో మధ్యవర్తిత్వం స్పష్టమైంది
- ట్రూత్ సోషల్ వేదికగా కీలక ప్రకటన చేసిన ట్రంప్
- భారత్, పాక్ నేతల విజ్ఞతపై ట్రంప్ ప్రశంసలు
- అమెరికా విదేశాంగ మంత్రి రుబియో సైతం ధ్రువీకరణ
- చర్చల్లో పాల్గొన్న మోదీ, షరీఫ్, డోభాల్, మునీర్
- జేడీ వాన్స్, రుబియోతో కలసి చర్చలకు అమెరికా ముందుండేలా
- భారత్, పాక్ అధికారిక ప్రకటనల ద్వారా సాంత్వన

2లో..

# కాల్పుల విరమణ అనంతరమే పాక్ వక్రబుద్ధి

- డ్రోన్లతో మళ్లీ ఉద్రిక్తతలు: జమ్మూ కశ్మీర్‌లో భారీ శబ్దాలు
- శ్రీనగర్‌లో సంభవించిన పేలుళ్ల శబ్దాలపై సీఎం ఒమర్ ఆందోళన
- పాకిస్థాన్ డ్రోన్ల దాడులకు భారత గగనతల రక్షణ ముఠా దీటుగా సమాధానం
- ఉధంపుర్, పఠాన్‌కోట్, జైసల్మేర్‌లో విద్యుత్ నిలిపివేత, బ్లాక్‌అవుట్
- గుజరాత్‌లోనూ పాక్ డ్రోన్ల అరాచకాలు? హోంమంత్రి హర్ష్ సంఘవి ప్రకటన
- "ఎలాంటి కాల్పుల్లేవు, డ్రోన్లు కనిపించి వెనక్కి వెళ్లిపోయాయి" – సైనిక వర్గాలు

2లో..




# కాల్పుల విరమణ ఒప్పందాన్ని పాక్ ఉల్లంఘించడం అత్యంత దుర్మార్గం

- విరమణకు అంగీకరించిన కొన్ని గంటల్లోనే డ్రోన్ దాడులు
- డీజీఎంఓ చర్చల తర్వాత ఒప్పందం.. కానీ పాక్ వెనకడుగు
- సైన్యానికి పూర్తి అధికారాలు – పాకిస్థాన్‌కు సమాధానం సిద్ధం
- శ్రీనగర్‌లో డ్రోన్ల సంచారం.. సైన్యం వెంటనే నిర్వీర్యం
- శాంతికి అవకాశం ఇచ్చిన భారత్‌పై పాక్ మోసపూరిత చర్య
- ఒప్పందంపై మరోసారి చర్చకు 12న డీజీఎంవో భేటీ
- సరిహద్దుల్లో ఎప్పటికప్పుడు మారుతున్న పరిస్థితులపై అధికారులు అప్రమత్తం

2లో..

# గచ్చిబౌలిలో గ్లోబల్ గ్లామర్ ఫెస్టివల్

## అందం, అభినయం, ఆత్మవిశ్వాసంతో ఆకట్టుకున్న మిస్ వరల్డ్ ప్రారంభ వేడుక



- జయ జయహే తెలంగాణతో మొదలైన సాంస్కృతిక సమ్మేళనం
- తెలంగాణ గీతంతో ఆలపన, స్థానిక కళాకారుల గొప్ప ప్రదర్శనలు
- పాశ్చాత్య బీట్‌కు తెలంగాణ కళలతో ఆకర్షణీయ సమన్వయం
- ఖండాల వారీగా వేదికపైకి వచ్చిన ప్రపంచ సుందరీమణులు
- 109 దేశాల నుంచి వచ్చిన అందగత్తెల పరిచయ ప్రదర్శన
- మిస్ ఇండియా నందినీ గుప్తా రాగానే మార్మోగిన స్టేడియం
- ఘనంగా ప్రారంభించిన సీఎం రేవంత్‌రెడ్డి
- ముఖ్య అతిథుల సమక్షంలో అధికారికంగా ప్రారంభమైన పోటీలు
- మిస్ వరల్డ్ క్రిస్టీనా పిస్కోవా తెలుగు తూర్పు నగరానికి నీరాజనం
- తెలంగాణ ఆతిథ్యం, సంప్రదాయాలపై ఆమె ఉద్దేశ్యభరిత ప్రసంగం

2లో..



# అన్ని పదవుల జాబితా ఒకేసారి విడుదల

- గాంధీభవన్ వర్గాల నుంచి ప్రకటనకు ఆసన్న సమాచారం
- ఢిల్లీకి చేరిన ప్రతిపాదనలు
- టీపీసీసీ కమిటీలలో జాప్యం
- ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు గడిచినా నామినేషన్లలో ముందడుగు లేరు
- ప్రధాన బాధ్యతలు ఖాళీగా ఉన్నాయి
- ప్రచార కమిటీ కొనసాగింపు, ఇతర పదవులు ఖాళీ
- ఎన్నికల సమయంలో నియమించిన కమిటీ ఇప్పటివరకూ యథావిధిగా
- జిల్లా, బ్లాక్, మండల కాంగ్రెస్ కమిటీల పరిస్థితి ఆందోళనకరం




హైదరాబాద్ (తెలంగాణ ముచ్చట్లు)

తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) పదవుల జాబితాలన్నీ ఒకేసారి విడుదల అవుతాయని తెలుస్తోంది. ఈ మేరకు రాష్ట్ర పార్టీ పెద్దల కసరత్తు పూర్తయిందని, వివిధ కమిటీలకు సంబంధించిన ప్రతిపాదనలు ఢిల్లీ చేరాయని గాంధీభవన్ వర్గాలు అంటున్నాయి. గత గురువారం ఢిల్లీ వెళ్లిన టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ ఈ కమిటీలకు సంబంధించిన ప్రతిపాదనలన్నింటినీ అధిష్ఠానం పెద్దలకు ఇచ్చి వచ్చారు. ఈ నేపథ్యంలో ఇక కమిటీల బంతి అధిష్ఠానం కోర్టుకు చేరిందని, త్వరలోనే అధిష్ఠానం ఈ కమిటీలకు సంబంధించిన అధికారిక ప్రకటన విడుదల చేస్తుందని తెలుస్తోంది.

మిగతా 2లో..

# భారత సైనికులకు వందనం

హైదరాబాద్ (తెలంగాణ ముచ్చట్లు)

భారత్‌పాకిస్థాన్ మధ్య కాల్పుల విరమణను స్వాగతిస్తున్నామని ఎమ్మెల్సీ కవిత శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 'భారతీయులను కాపాడేందుకు ప్రాణాలొడ్డి పోరాడిన సైనికులకు వందనం.. ఈ పోరాటంలో అసువులు బాసిన భారత జవాన్లకు ఘనమైన నివాళి. అయితే విరమణపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ట్వీట్ చేయడం ఆశ్చర్యమనిపించింది. మన ప్రధాని ఈ విషయాన్ని స్వయంగా వెల్లడిస్తే భారత గొప్పతనం మరింత ఇనుమడించేది. ఏదేమైనా కాల్పులు విరమణ శుభ పరిణామం. సాధ్యమైనంత తొందరలో పార్లమెంట్ ప్రత్యేక సమావేశం నిర్వహించి భారత్‌పాక్ మధ్య ఉద్రిక్తతలు తిరిగి తలెత్తకుండా తీసుకోవాల్సిన చర్యలపై చర్చించాలి' అని సూచించారు.





# కులగణన వల్లే పంచాయతీ ఎన్నికల ఆలస్యం

- జనాభా ఆధారంగా రిజర్వేషన్ల నిబంధనల ప్రకారం చర్యలు
- ప్రజాప్రతినిధుల లేకపోతే బాధ్యత కార్యదర్శులపై
- గ్రామాలలో అధికారుల నియామకంతో పనిభారం తగ్గింపు

హైదరాబాద్ (తెలంగాణ ముచ్చట్లు)

జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్ల కోసం కులగణన చేపట్టామని, దీంతో రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికలు ఆలస్యమయ్యాయని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి సీతక పేర్కొన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు లేకపోవడంతో భారం మొత్తం పంచాయతీ కార్యదర్శులపైనే పడుతున్నదని, పనిభారాన్ని తగ్గించేందుకు గ్రామాల్లో అధికారులను నియమిస్తున్నట్టు చెప్పారు.

మిగతా 2లో..

ఆదివారం-11- మే 2025

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# దేశ రక్షణ కోసం అన్ని విధాలుగా సిద్ధంగా ఉన్నాం: భారత ఆర్మీ

(మొదటి పేజీ తరువాయి)

పాక్ చెప్పినట్లు.. భారత్ ఆర్మీకి ఏమీ నష్టం జరగలేదు. భారత సైన్యం.. పాక్ ఆర్మీ బేస్ లను ధ్వంసం చేసింది. భారత్ పై కవ్వింపు చర్యలకు దిగి, పాక్ తీవ్రంగా నష్టపోయింది. ఎల్ఓసీ దగ్గర పాక్ తీవ్రంగా నష్టపోయింది. బారత్, పాక్ ల మధ్య ఒప్పందం కుదిరింది' అని భారత ఆర్మీ స్పష్టం చేసింది.

**భారత్-పాక్‌ల మధ్య కాల్పుల విరమణ**

భారత్‌పాకిస్తాన్‌లు కాల్పుల విరమణకు అంగీకారం తెలిపాయి. ఈ విషయాన్ని భారత విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ అధికారికంగా పేర్కొన్నారు. శనివారం, మే10, 5 గంటల నుంచి కాల్పుల విరమణ అమలులోకి వచ్చినట్లు ఆయన వెల్లడించారు.ఈ రోజు మధ్యాహ్నం 3.35 గంటలకు పాక్ డీజీఎంఓ.. భారత్ డీజీఎంఓకు ఫోన్ చేసి కాల్పులు విమరణ చేయాలని కోరినట్లు మిస్రీ పేర్కొన్నారు. పాకిస్తాన్ అభ్యర్థనతో.. భారత్ కాల్పుల విరమణకు అంగీకరించినట్లు చెప్పారు. కాగా ఎల్లుండి (సోమవారం, మే 12) మధ్యాహ్నం 12 గంటలకు ఇరుదేశాల మిలటరీ జనరల్స్ మధ్య చర్చలు జరుగుతాయని ప్రకటించారు.



# గచ్చిబౌలిలో గ్లోబల్ గ్లామర్ ఫెస్టివల్

శనివారం సాయంత్రం.. భాగ్యనగరం గచ్చిబౌలి ఇండోర్ స్టేడియం.. అందం.. ఆత్మవిశ్వాసం.. అభినయం.. కలిసి కవాతు చేశాయి..ప్రపంచ సుందరి పోటీల ప్రారంభ వేడుకలను సప్తవర్ణ శోభితం చేశాయి. మిస్ వరల్డ్ 72వ ఎడిషన్ పోటీలు హైదరాబాద్ కేంద్రంగా ఘనంగా ప్రారంభమయ్యాయి. ప్రపంచం నలుమూలల నుంచి 109 దేశాలకు ప్రాతినిధ్యం వహిస్తూ వచ్చిన పోటీదారులైన అందగత్తెలు లయబద్ధమైన పాశ్చాత్య సంగీత హోరుకు తగ్గట్టుగా అభినయిస్తూ తమను తాము పరిచయం చేసుకోగా, ఆయా సుందరీమణుల బృందాన్ని తెలంగాణ సంప్రదాయ కళాకారుల బృందం నర్తిస్తూ వేదిక మీదకు స్వాగతించింది. ఒకవైపు పాశ్చాత్య సంగీతం.. మరోవైపు తెలంగాణ సంప్రదాయ కళా బృందాల విన్యాసం.. వెరసి ఓ జుగల్‌బందీగా ఆహూతులను మంత్రముగ్ధులను చేశాయి. దాదాపు రెండున్నర గంటల పాటు కొనసాగిన ప్రపంచ సుందరి పోటీల ప్రారంభ కార్యక్రమం ప్రేక్షకులను ఆసాంతం అలరించింది.

**జయ జయహే తెలంగాణ ఆలాపనతో..**

గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో పరిమిత సంఖ్యలో హాజరైన ప్రేక్షకుల మధ్య ప్రపంచ సుందరి పోటీల పరిచయ కార్యక్రమం కొనసాగింది. సాయంత్రం ఆరున్నరకు తెలంగాణ గీతం జయ జయహే తెలంగాణ ఆలాపనతో కార్యక్రమం మొదలైంది. గాయకుడు సంగీత శిక్షకుడు రామాచారి శిష్యులు 50 మంది ఈ గీతాన్ని అద్భుతంగా ఆలపించి ఆకట్టుకున్నారు. ఆ వెంటనే రాష్ట్రంలోని నాలుగు ప్రాంతాలకు చెందిన సంగీత శిక్షణ కేంద్రాల కళాకారిణులు 250 మంది పేరిణి నృత్య రూపాన్ని ప్రదర్శించారు.

'హంస నడకలతో అందమే సాగెనే... అరవిరిసిన..' అంటూ ప్రపంచ సుందరి పోటీలకు సరిపోయే గీతాన్ని ఎంచుకున్న తీరు ఆకట్టుకుంది. దానికి తగ్గట్టుగా కళాకారిణులు నర్తించి పరవశింపజేశారు. అంత పెద్ద సంఖ్యలో కళాకారిణులు స్టేడియం మొత్తం కలిగి తిరుగుతూ నర్తించటం, మధ్యలో సీతాకోకచిలుక, నక్షత్రం, మిస్ వరల్డ్ లోగో ఆకృతిని ఆవిష్కరించడం అబ్బురపరిచింది. దాదాపు 10 నిమిషాల పాటు సాగిన ఈ నృత్య కార్యక్రమానికి పేరిణి సందీప్ నృత్య దర్శకత్వం వహించగా, ఫణి నారాయణ స్వరాలు సమకూర్చారు.

**ఖండాల వారీగా నాలుగు బృందాలుగా..**

ప్రారంభ వేడుకల్లో 109 దేశాల సుందరీమణులు పాల్గొన్నట్టు నిర్వాహకులు ప్రకటించారు. వీరిని ఖండాల వారీగా నాలుగు బృందాలుగా విభజించారు. తొలుత తెలంగాణకు చెందిన ఒక్కో సంప్రదాయ కళా బృందం ప్రదర్శన ఇవ్వగా, ఆ వెంటనే ఒక్కో బృందం చొప్పున సుందరీమణులు స్టేడియంలోకి వచ్చి పరిచయ కార్యక్రమంలో పాల్గొన్నారు. ముందుగా రామకృష్ణ ఆధ్వర్యంలో కొమ్ము కోయ బృందం కోయ డప్పు నృత్యం ప్రదర్శించారు. ఆ వెంటనే అమెరికా-కరేబియన్ దేశాలకు చెందిన తొలి సుందరీమణుల బృందం వచ్చింది.

నిర్వాహకులు దేశాల వారీగా పిలవగానే ఆయా దేశాల ప్రతినిధులు ఒక్కొక్కరు పాశ్చాత్య బీట్‌కు తగ్గట్టుగా నర్తిస్తూ అభివాదం చేసుకుంటూ పరిచయం చేసుకున్నారు. తొలుత అర్జెంటీనా సుందరీమణి రాగా, చివరగా వెనిజువెలా అందెగత్తె వచ్చింది. అనంతరం గోండు గుస్సాడీ కళాకారులు శ్రీధర్ ఆధ్వర్యంలో నృత్యాన్ని ప్రదర్శించారు. ఆ వెంటనే ఆఫ్రికా ఖండానికి చెందిన దేశాల సుందరీమణులు వచ్చి పరిచయం చేసుకున్నారు. అంగోలా సుందరీమణి ముందు రాగా, చివరగా జింబాబ్వే దేశానికి చెందిన పోటీదారు వచ్చింది.

అనంతరం 14 మంది లంబాడీ డప్పు కళాకారులు స్వప్న, అందె భాస్కర్ ఆధ్వర్యంలో నృత్యాన్ని ప్రదర్శించారు. ఆ వెంటనే యూరప్ ఖండానికి చెందిన దేశాల పోటీదారులు వచ్చి పరిచయం చేసుకున్నారు. చివరగా ఒగ్గు డోలు బృందం కళాకారులు 18 మంది ఒగ్గు రవికుమార్ ఆధ్వర్యంలో కళారూపాన్ని ప్రదర్శించారు. ఈ సందర్భంగా హ్యూమన్ పిరమిడ్ ఏర్పాటు చేసి పైకి ఎక్కిన కళాకారుడు జాతీయ జెండాను రెపరెపలాడేలా చేసిన తీరు ఆకట్టుకుంది. అనంతరం ఆసియా-ఓయానా దేశాల ప్రతినిధులు స్టేడియంలోకి వచ్చి పరిచయం చేసుకున్నారు.

**మిస్ ఇండియా నందినీ గుప్తా రాగానే మార్మోగిన స్టేడియం..**

చివరి బృందంలో భాగంగా మిస్ ఇండియా వరల్డ్ నందినీ గుప్తా వచ్చినప్పుడు స్టేడియం చప్పట్లు, ఈలలు, కేరింతలతో మార్మోగింది. గోకులంలో గోపిక వస్త్రధారణతో నందినీ గుప్తా స్టేడియంలోకి వచ్చారు. వేషధారణకు తగ్గట్టు తన పరిచయంలో భాగంగా ఆమె కవ్వంతో వెన్న చిలికే అభినయంతో రావటం విశేషం. నేపాల్‌కు చెందిన సుందరీమణి గులాబీ డిజైన్, అదే రంగు రవికతో తెలుపు రంగు చీరకట్టుతో రావటం ఆకట్టుకుంది. బంగ్లాదేశ్, టర్కీ దేశాల ప్రతినిధులు కూడా హాజరుకాగా.. థాయిలాండ్ సుందరీమణి చీరకట్టును పోలిన వస్త్రధారణతో వచ్చింది. శ్రీలంక యువతి నమస్కార ముద్రతో పరిచయం చేసుకుంది. చివరలో వచ్చిన వియత్నాం సుందరి వేగంగా నర్తిస్తూ ఆకట్టుకుంది. ఆస్ట్రేలియా యువతి కౌబాయ్ గెటప్‌లో వచ్చింది.

**పోటీలు ప్రారంభమైనట్టు ప్రకటించిన సీఎం**

పరిచయ కార్యక్రమం ముగిసిన తర్వాత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కార్యక్రమానికి హాజరయ్యారు. మిస్ వరల్డ్ లిమిటెడ్ చైర్‌పర్సన్ జూలియా మోర్లే, ప్రస్తుత మిస్ వరల్డ్ క్రిస్టీనా పిస్కోవాలు పరిచయం చేసుకుని కరచాలనం చేశారు. అనంతరం ఆ ఇద్దరితో కలిసి ప్రపంచ సుందరి 72వ ఎడిషన్ పోటీలు ప్రారంభమయ్యాయని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆహూతులు, పోటీదారుల కరతాళధ్వనుల మధ్య ప్రకటించారు. పరిచయ కార్యక్రమం ముగిసిన తర్వాత పోటీదారులు అందరూ స్టేడియంలోకి వారివారి జాతీయ జెండాలు చేతపట్టుకుని ఊపుతూ వచ్చారు. చివరగా భారత పతాకాన్ని చేతబూని మిస్ ఇండియా వరల్డ్ నందినీ గుప్తా వచ్చారు. అప్పుడు స్టేడియంలోని ప్రేక్షకులు లేచి నిలబడి కరతాళ ధ్వనులతో స్వాగతం పలికారు. అంతా ప్రపంచ శాంతిని కాంక్షించే మిస్ వరల్డ్ గీతాన్ని బృంద గానంగా ఆలపించారు.

- భారత దేశ సరిహద్దులో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల్లో అసమాన ప్రదర్శన చాటిన సైనికులకు వందనం సమర్పిస్తున్నట్టు వ్యాఖ్యాత ప్రకటించినప్పుడు 'జైహింద్' నినాదాలతో స్టేడియం మార్మోగింది. చివరకు జాతీయ గీతాలాపనతో కార్యక్రమం ముగిసింది. ప్రారంభ వేడుకల్లో పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎంపీ మల్లు రవి, నగర మేయర్ విజయలక్ష్మిమ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, డీజీపీ జితేందర్, పర్యాటకాభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేశ్‌రెడ్డి, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్‌రంజన్ తదితరులు పాల్గొన్నారు.

**గొప్ప నగరంలో ఉన్నందుకు పులకిస్తున్నాం: మిస్ వరల్డ్ క్రిస్టీనా పిస్కోవా**

'నమస్తే హైదరాబాద్.. నమస్తే తెలంగాణ. ఈ అద్భుతమైన నగరంలో 72వ మిస్ వరల్డ్ పోటీల ప్రారంభోత్సవంలో మీ అందరితో కలిసి పాల్గొనటం నాకు గర్వంగా ఉంది. ఈ అద్భుత దేశం, గొప్ప సాంస్కృతిక కేంద్రంలో మేము 'బ్యూటీ విత్ పర్పస్' అనే అద్భుత కార్యక్రమంలో ఐక్యతను చాటుతూ పాల్గొంటున్నాం. తెలంగాణ సంప్రదాయాలు, గొప్ప చరిత్ర, అద్భుత ఆతిథ్యం నన్ను ఎంతగానో ఆకర్షించాయి. మిస్ వరల్డ్ అనేది కేవలం అందం గురించి మాత్రమే కాదు.

ఇది ప్రపంచంలో ఓ మార్పును తీసుకువచ్చే లక్ష్యంతో సాగుతుంది. విద్య, సాధికారత, సమాజ సేవ ద్వారా ప్రపంచాన్ని మెరుగుపరచడం ఇందులో భాగం. 109 దేశాల నుంచి వచ్చిన మహిళలు గొప్ప లక్ష్యంతో ఒక్కటిగా ఈ పోటీల్లో పాల్గొంటారు. ఈ సందేశాన్ని ప్రపంచానికి చాటేందుకు ఇప్పుడు హైదరాబాద్ సరైన వేదికగా నిలి చింది. ఈ నగరంలో సంప్రదాయం-ఆధునికత ఒకదానికొకటి పెనవేసుకుని ఉన్నాయి. ఇక్కడి ఆతిథ్యానికి, ,హృదయపూర్వక స్వాగతానికి ధన్యవాదాలు..' అని మిస్ వరల్డ్ క్రిస్టీనా పిస్కోవా అన్నారు.



# అన్ని పదవుల జాబితా ఒకేసారి విడుదల

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి దాదాపు రెండేళ్లు అవుతోంది. ప్రభుత్వం ఏర్పాటయినప్పుడు పీసీసీ అధ్యక్షుడిగా ఉన్న ప్రస్తుత ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి స్థానంలో బి.మహేశ్‌కుమార్‌గౌడ్ బాధ్యతలు చేపట్టి కూడా సంవత్సరం దాటిపోయింది. కానీ, ఇంత వరకు అటు టీపీసీసీ కమిటీలను కానీ, ఇటు క్షేత్రస్థాయి పదవులను కానీ భర్తీ చేయలేదు. టీపీసీసీ కార్యవర్గంలో భాగంగా పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్లు, ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, కార్యదర్శులు, అధికార ప్రతినిధులతో పాటు కార్యవర్గ సభ్యుల నియామకం చేపట్టలేదు. ఎన్నికల సమయంలోనే నియమించిన ప్రచార కమిటీ కొనసాగుతోంది. ఏఐసీసీ కార్యక్రమాల అమలు కమిటీ చైర్మన్ పోస్టు ఖాళీ అయి దాదాపు మూడేళ్లు కావస్తోంది. జిల్లా పార్టీ అధ్యక్షులుగా గతంలో ఎప్పుడో నియమించిన వారే కొనసాగుతున్నారు. బ్లాక్, మండల, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుల నియామకాలు కూడా పూర్తి కాలేదు. ఈ నేపథ్యంలో రాష్ట్ర స్థాయి కమిటీలన్నింటినీ నియమించేందుకు పలు దఫాలుగా ఇటు హైదరాబాద్‌లో, అటు ఢిల్లీ పెద్దల సమక్షంలో అనేక సార్లు చర్చలు జరిగాయి. కానీ, కమిటీల ప్రకటన వెలువడలేదు.

కమిటీల కసరత్తు పూర్తయిందని, నేడో రేపో ప్రకటిస్తారని అనుకుంటున్న సమయంలోనే రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి మారారు. దీపాదాస్ మున్షీ స్థానంలో మీనాక్షి నటరాజన్ రావడంతో కథ మళ్లీ మొదటికొచ్చింది. ఆమె ప్రాతిపదికలు మారిపోవడంతో పార్టీ కమిటీల నియామకానికి మళ్లీ కసరత్తు జరిగింది. ఈ కసరత్తు పూర్తి కావడంతో మూడు రోజుల క్రితమే ప్రతిపాదనలు ఢిల్లీకి చేరాయని సమాచారం.



గాంధీభవన్ వర్గాల నుంచి అందుతున్న సమాచారం ప్రకారం.. ఈసారి పార్టీ సంస్థాగత కమిటీలతో పాటు రాష్ట్ర పార్టీలో కీలకమైన రాజకీయ వ్యవహారాల సలహా (పీఏసీ) కమిటీని కూడా పునర్నియమించనున్నారు. జై బాపూ-జై సంవిధాన్ కమిటీ (ఏఐసీసీ కార్యక్రమాల అమలు కమిటీ)ని కూడా ఏర్పాటు చేయనున్నారు. దీంతో పాటు మీడియా సమన్వయం కోసం డెడికేటెడ్ కమిటీని ఏర్పాటు చేస్తారని, ఈ కమిటీకి ఎంపీని ఇన్‌చార్జిగా నియమిస్తారని తెలుస్తోంది.



# కులగణన వల్లే పంచాయతీ ఎన్నికల ఆలస్యం

శనివారం రంగారెడ్డి జిల్లా పెద్ద అంబర్‌పేటలో రాష్ట్ర పంచాయతీ సెక్రటరీ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పంచాయతీ కార్యదర్శుల ఆత్మీయ సమ్మేళనంలో ఆమె ముఖ్యఅతిథిగా మాట్లాడారు.

గ్రామ కార్యదర్శుల అపాయింట్‌మెంట్ డేతోపాటు నాలుగేండ్ల సర్వీసును పరిగణనలోకి తీసుకునే అం శం, అవుట్‌సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులను జూనియర్ పంచాయతీ కార్యదర్శులుగా పదోన్నతులు కల్పించడంతోపాటు ఇతర అంశాలపై త్వరలో చర్చిస్తామని తెలిపారు. పంచాయతీ కార్యదర్శుల పెండింగ్ బిల్లులను త్వరలో క్లియర్ చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్, ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్సీ కోదండరాం, ఎమ్మెల్యేలు కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, మల్‌రెడ్డి రంగారెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి సురేష్‌మోహన్ తదితరులు పాల్గొన్నారు.

# కాల్పుల విరమణ ఒప్పందాన్ని పాక్ ఉల్లంఘించడం అత్యంత దుర్మార్గం

ఢిల్లీ (తెలంగాణ ముచ్చట్లు)

సరిహద్దుల్లో పాకిస్థాన్ కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించిందని భారత విదేశాంగశాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీ తెలిపారు. శనివారం రాత్రి దిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడారు. కాల్పుల విరమణ అవగాహనను పాక్ ఉల్లంఘించడం సరికాదన్నారు. డీజీఎంవో మధ్య జరిగిన అవగాహనను ఉల్లంఘించడాన్ని ఖండిస్తున్నట్టు చెప్పారు. కొన్ని గంటలుగా పాక్ కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘిస్తోందని, ఇది అత్యంత దుర్మార్గమని ఘాటుగా స్పందించారు. కాల్పుల ఉల్లంఘనకు సంపూర్ణ బాధ్యత పాక్‌దేనని స్పష్టం చేశారు. సరిహద్దుల్లో పాక్ ఉల్లంఘనలకు సైన్యం తగిన విధంగా జవాబిస్తుందన్నారు. పాక్ అతిక్రమణను నిలువరించేందుకు సైన్యానికి సంపూర్ణ అధికారాలు ఇచ్చామని తెలిపారు. ఇప్పటికైనా ఈ ఉల్లంఘనలను పాకిస్థాన్ నిలువరిస్తుందని ఆశిస్తున్నట్టు విక్రమ్ మిస్రీ చెప్పారు.



"మధ్యాహ్నం 3.35 గంటలకు ఇరు దేశాల డైరెక్టర్ జనరల్ ఆఫ్ మిలటరీ ఆపరేషన్స్ (DGMO) స్థాయిలో ఇరుదేశాల మధ్య చర్చలు జరిగాయి. పాకిస్థాన్ డీజీఎంఓ భారత డీజీఎంవోకు ఫోన్ చేశారు. కాల్పుల విరమణకు ఇరు దేశాల సైనికాధికారులు అంగీకరించారు. సాయంత్రం 5గంటల నుంచి ఇది అమల్లోకి వచ్చింది. భూ, గగన, సముద్రతలాల నుంచి ఇరు దేశాల మధ్య కాల్పుల విరమణ కొనసాగుతుంది. వీటికి సంబంధించి ఇరుదేశాల సైన్యానికి తగిన ఆదేశాలు వెళ్లాయి. ఈ నెల 12న సాయంత్రం డీజీఎంవోలు మళ్లీ చర్చలు జరుపుతారు" అని విదేశాంగ శాఖ ప్రకటించింది. ఆ తర్వాత కొన్ని గంటలకే పాక్ నుంచి డ్రోన్లు భారత భూ భాగంలోకి దూసుకొచ్చాయి. ఎక్కడికక్కడ డ్రోన్లను సైన్యం నిర్వీర్యం చేస్తోంది. శ్రీనగర్‌లోని 25 కార్ప్స్ ప్రధాన కార్యాలయం వద్ద కనిపించిన అన్ని డ్రోన్లను నిర్వీర్యం చేసినట్టు సైనిక వర్గాలు తెలిపాయి. మరో వైపు శ్రీనగర్‌లో కాల్పుల శబ్దాలు వినిపిస్తున్నాయని సీఎం ఒమర్ అబ్దుల్లా ట్వీట్ చేశారు.

# కాల్పుల విరమణకు భారత్-పాక్ అంగీకరించాయి: డొనాల్డ్ ట్రంప్

భారత్ పాకిస్థాన్‌లు కాల్పుల విరమణకు అంగీకరించాయని, ఇందుకు అమెరికా మధ్యవర్తిత్వం వహించిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. ఈ మేరకు తన ట్రూత్‌సోషల్‌లో శనివారం సాయంత్రం ఓ పోస్ట్ పెట్టారు. "అమెరికా మధ్యవర్తిత్వంలో రాత్రంతా సుదీర్ఘంగా చర్చలు జరిగాయి. తక్షణమే కాల్పుల విరమణ చేపట్టేందుకు భారత్, పాక్ అంగీరించాయి. సరైన సమయంలో ఇరు దేశాలు విజ్ఞతతో, తెలివిగా వ్యవహరించాయి. అందుకు ధన్యవాదాలు" అని ట్రంప్ తన పోస్ట్‌లో పేర్కొన్నారు. ఈ విషయాన్ని భారత్, పాక్ వేర్వేరు ప్రకటనల్లో ధ్రువీకరించాయి. ట్రంప్ పోస్ట్ చేసిన కాసేపటికే అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రుబియో సైతం ఇదే తరహా ప్రకటన చేశారు. భారత్, పాక్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిందని పేర్కొన్నారు. భారత్, పాక్ ప్రధానులు నరేంద్రమోదీ, షెహబాజ్ షరీఫ్, భారత విదేశాంగ శాఖ మంత్రి జైశంకర్, పాక్ చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్ అసిమ్ మునీర్, ఇరు దేశాల జాతీయ భద్రతా సలహాదారులు అజిత్ డోభాల్, అసిమ్ మాలిక్‌లతో మాట్లాడినట్లు చెప్పారు. తాను, అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ ఇందుకు సంబంధించిన చర్చల్లో పాల్గొన్నామని పేర్కొన్నారు.



# కాల్పుల విరమణ అనంతరమే పాక్ వక్రబుద్ధి

హైదరాబాద్ (తెలంగాణ ముచ్చట్లు)

కాల్పుల విరమణకు అంగీకరించిన కొన్ని గంటల్లోనే పాక్ తన వక్రబుద్ధిని చాటుకున్నట్లు తెలుస్తోంది. తాజాగా జమ్మూ కశ్మీర్‌తోపాటు ఇతర సరిహద్దు రాష్ట్రాల్లో పాక్ డ్రోన్ దాడులకు తెగబడుతున్నట్లు సమాచారం. శ్రీనగర్‌లో భారీ శబ్దాలు వినిపిస్తున్నాయని జమ్మూకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా పేర్కొన్నారు. ఈ సందర్భంగా కాల్పుల విరమణ సంగతేంటని ఆయన 'ఎక్స్' వేదికగా ప్రశ్నించారు.

కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించి అంతర్జాతీయ సరిహద్దుతోపాటు నియంత్రణ రేఖ వెంబడి శనివారం రాత్రి అనేక ప్రాంతాల్లో పాక్ దాడులకు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది. జమ్మూ కశ్మీర్‌లోని ఉధంపుర్, శ్రీనగర్‌లలో భారీ శబ్దాలు వినిపిస్తున్నాయి. ఈ పాక్ డ్రోన్లను గగనతల రక్షణ వ్యవస్థలు ఎప్పటికప్పుడు ధ్వంసం చేస్తున్నట్లు తెలుస్తోంది. పోఖ్రాన్‌లో, శ్రీనగర్‌లోని ఆర్మీ హెడ్ క్వార్టర్స్ సమీపంలో పలు డ్రోన్లను కూల్చివేసినట్లు సమాచారం.

మళ్లీ ఉద్రిక్త పరిస్థితులు తలెత్తడంతో పంజాబ్‌లోని పఠాన్‌కోట్, ఫిరోజ్‌పుర్, రాజస్థాన్‌లోని జైసల్మేర్, బాడ్‌మేర్‌లలో పూర్తిగా కరెంటు నిలిపివేశారు. కరువాలో బ్లాక్‌అవుట్ పాటిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా సైరన్లు మోగుతున్నాయి. పంజాబ్‌లోని మోగాలోనూ కరెంటు నిలిపివేశారు.

గుజరాత్‌లోనూ డ్రోన్ దాడులు?

గుజరాత్‌లోనూ పాకిస్థాన్ డ్రోన్ దాడులకు తెగబడినట్లు తెలుస్తోంది. కచ్ జిల్లాలో అనేక చోట్ల డ్రోన్లు కనిపించాయని గుజరాత్ హోంమంత్రి హర్ష్ సంఘవి వెల్లడించారు. ప్రస్తుతం పూర్తి బ్లాక్‌అవుట్ అమలు చేస్తున్నామని చెప్పారు. ప్రజలు సురక్షితంగా ఉండాలని, భయాందోళనలకు గురికావద్దని 'ఎక్స్' వేదికగా సూచించారు.

నియంత్రణ రేఖ వద్ద ఎలాంటి కాల్పులు జరగలేదని ఏడీజీ తెలిపారు. "డ్రోన్లు కొన్ని వచ్చాయి.. వెనక్కి వెళ్లిపోయాయి. శ్రీనగర్‌లో ఎలాంటి కాల్పులు, పేలుళ్లు లేవు. ఈ మధ్యాహ్నం జరిగిన ద్వైపాక్షిక అవగాహనను పాక్ ఉల్లంఘించింది. పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది" అని సైనిక వర్గాలు వెల్లడించారు.

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక





# కొత్తగూడెం రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులు ఇంకెప్పుడు పూర్తి చేస్తారు..?

- ఖమ్మం ఎంపీ రఘురాం రెడ్డి అసంతృప్తి
- భద్రాచలం రోడ్డు స్టేషన్ పనుల జాప్యంపై ఆగ్రహం
- త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశాలు

**ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:** భద్రాచలం రోడ్డు (కొత్తగూడెం) రైల్వే స్టేషన్ పనులు పూర్తి చేయడంలో జరుగుతున్న జాప్యంపై ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. శనివారం ఆయన ఈ స్టేషన్ ను ఆకస్మిక తనిఖీ చేశారు. అనుకున్న సమయంలో పనులు జరగకపోవడం వల్ల ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయాన్ని రైల్వే ఉన్నతాధికారులకు ఫోన్ చేసి.. వారి దృష్టికి తీసుకెళ్లారు. కాంట్రాక్టర్ తో మాట్లాడి.. పనులు ఎందుకు ఆలస్యం అవుతున్నాయని ప్రశ్నించారు. ఇకనైనా.. త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఎంపీ వెంట మాజీ జడ్పి చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్, యూత్ కాంగ్రెస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు చీకటి కార్తీక్, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు ఆళ్ళ మురళి, ఊకంటి గోపాల్ రావు, మాజీ ఏఎంసి చైర్మన్ రాంబాబు మరియు తదితరులు పాల్గొన్నారు.






# భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులలో దరఖాస్తుల స్వీకరణ...

**తహశీల్దార్లు పున్నంచందర్, రాంబాబు లు.**
**భూ భారతి చట్టంతో భూ సమస్యలు వేగంగా పరిష్కారం**

**ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:** భూ సమస్యల శాశ్వత పరిష్కారానికి ప్రభుత్వం భూ భారతి చట్టాన్ని అమల్లోకి తెచ్చిందని, గ్రామాల్లో చేపడుతున్న రెవెన్యూ సదస్సుల్లో భూ సమస్యల పరిష్కారానికి దరఖాస్తుల స్వీకరిస్తున్నట్లు తహశీల్దార్లు ఏ. పున్నం చందర్, ఆర్. రాంబాబు లు అన్నారు. మంగళవారం బోనకల్ మండలం చిరునోముల, మోటమర్రి గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించి, భూ సమస్యలకు సంబంధించి రైతుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా తహశీల్దార్లు మాట్లాడుతూ, రైతులకు తమ భూముల విషయంలో ఉన్న అభద్రత భావాన్ని తావు నీయకుండా జవాబుదారుతనాన్ని పెంచేందుకు భూ భారతి చట్టాన్ని చేపట్టడం జరిగిందని అన్నారు. కొత్త చట్టం ద్వారా లావాదేవీల సేవలు, రిజిస్ట్రేషన్, మ్యుటేషన్, నిషేధిత భూములు, ఆర్ఓఆర్ మార్పులు చేర్పులు వంటి సేవలు సులభతరం అవుతాయని తెలిపారు. రైతులకు, అధికారులకు సులభంగా అర్థం అయ్యేలా సామాన్య, గ్రామీణ ప్రజల, రైతుల సమస్యలు పరిష్కారం అయ్యేలా భూ భారతి చట్టం ఉందన్నారు. హక్కుల రికార్డులలో తప్పుల సవరణకు భూ భారతి లో అవకాశం ఉందన్నారు. పెండింగ్ సాదా బైనామా దరఖాస్తుల పరిష్కారం లభిస్తుందన్నారు. భూమి హక్కులు ఏ విధంగా సంక్రమించిన మ్యుటేషన్ చేసి రికార్డులలో నమోదు చేయవచ్చన్నారు. భూ సమస్యల పరిష్కారానికి భూ భారతి చట్టంలో రెండు అంచెల అప్పీల్ వ్యవస్థ ఉందని తెలిపారు. భూదార్ కార్డుల జారీ జరుగుతుందన్నారు. రైతులకు ఉచిత న్యాయ సహాయం లభిస్తుందని తెలిపారు. గ్రామ రెవెన్యూ రికార్డుల నిర్వహణ ఉంటుందని, మోసపూరితంగా హక్కుల రికార్డులు మార్చి, ఎవరైనా ప్రభుత్వ, భూదాన్, అసైన్డ్, ఎండోమెంట్, వక్ఫ్ భూములకు పట్టాలు పొందితే రద్దుచేసే అధికారం చట్టంలో ఉందన్నారు. హక్కుల రికార్డుల్లో తప్పుల సవరణకు, భూమి హక్కులు ఉంది రికార్డులో లేనివారు హక్కుల రికార్డులో నమోదు చేయించుకోవడానికి కొత్త చట్టం వచ్చిన సంవత్సరం లోగా దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా చిరునోముల గ్రామంలో చేపట్టిన రెవెన్యూ సదస్సులో భూ సమస్యలకు సంబంధించి 85, మోటమర్రి గ్రామ రెవెన్యూ సదస్సులో 160 దరఖాస్తులను అధికారులు స్వీకరించారు. స్వీకరించిన దరఖాస్తులకు అధికారులు రశీదులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆత్మ చైర్మన్ కర్నాటి రామ కోటేశ్వరరావు, బోనకల్ మండల ఆర్ఐలు నవీన్, మైథిలి, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# ప్రాంగణ నియామకాల్లో 16 మంది యస్.బి.ఐ.టి. విద్యార్థుల ఎంపిక

**ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:** ప్రముఖ ఐ.టి. రంగ సంస్థ జెన్ట్రీ ల్యాబ్స్ మరియు స్మార్ట్ బ్రైన్స్ కు తమ కళాశాలకు చెందిన 16 మంది విద్యార్థులు ఎంపికైనట్లు కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ తెలిపారు. గత వారం నిర్వహించిన ప్రాంగణ నియామకాలకు గాను శనివారం ఆఫర్ లెటర్స్ అందుకున్న సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తూ కృత్రిమ మేధస్సు ప్రపంచ గతిని శాసించే స్థాయిలో ఉందని, ఐ.టి. రంగ నిపుణులకు మంచి ఆదరణ ఉందని అభిప్రాయ పడ్డారు. ఎంపికైన విద్యార్థులు నిరంతరం నైపుణ్యాభివృద్ధి చెందాలని సూచించారు. అమెరికా కేంద్రంగా నిర్వహించబడుతున్న జెన్ ల్యాబ్స్ లో తమ విద్యార్థులు ఎంపిక అవ్వడం మరియు హెచ్. సి. ఎల్., కోఫోర్జ్ వంటి క్లైంట్స్ కలిగిన స్మార్ట్ బ్రైన్స్ లో ఉద్యోగాలు సాధించడం తమకు గర్వ కారణమని కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డా॥ జి. ధాత్రి తెలిపారు. ఇంటర్న్ ఇంజనీర్, డిసి ఆపరేషన్స్ మరియు సర్వీస్ డెస్క్ ఇంజనీర్ ఉద్యోగాలకు గాను నిర్వహించిన వివిధ దశల ఎంపికలలో జెన్ ల్యాబ్కు గాను 4గురు, స్మార్ట్ బ్రైన్స్ కు 12 మంది ఎంపికైనట్లు తెలియజేశారు. ఉద్యోగాలు సాధించిన విద్యార్థులకు శిక్షణ అనంతరం 22 నుండి 3.6 లక్షలు వార్షిక ఆధాయంగా లభిస్తుందని తెలిపారు. క్వాల్కామ్ వంటి అంతర్జాతీయ సంస్థలకు క్లైంట్గా ఉన్న జెన్రా ల్యాబ్స్ కు తమ కళాశాల విద్యార్థులను ఎంపిక చేయడం అటానమస్ గా తమకు తగిన గుర్తింపును తెచ్చినట్లు కళాశాల ప్రిన్సిపల్ డా॥ జి. రాజ్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థులను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపికలు నిర్వహించిన జెన్ ల్యాబ్స్ హెచ్.ఆర్. పి. నరేంద్ర తో పాటు కళాశాల అకడమిక్ డైరెక్టర్స్ గుండాల ప్రవీణ్ కుమార్, గంధం శ్రీనివాసరావు, డా॥ ఎ.వి.వి. శివ ప్రసాద్, డా॥ జె. రవీంద్రబాబు, డా॥ యన్. శ్రీనివాస రావు, టి.పి.ఒ. యన్. సవిత, కోఆర్డినేటర్ జి. ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.




# మాతృత్వం పట్ల గౌరవానికి ప్రతీకగా 'ఒయాసిస్ జనని యాత్ర' ను ప్రారంభించిన ఒయాసిస్ ఫెర్టిలిటీ

**సంతాన సాఫల్యతపై అవగాహన ర్యాలీ**
**నిపుణుల సంరక్షనను హన్మకొండకు తీసుకువస్తోంది**

**హన్మకొండ,తెలంగాణ ముచ్చట్లు:** భారతదేశంలో విశ్వసనీయ ఫర్టిలిటి కేర్ చెయిన్ గా పేరు పొందిన ఒయాసిస్ ఫెర్టిలిటీ మే నెలను మదర్స్ మంత్ గా వేడుక చేసుకుంటోంది. అందులో భాగంగా మదర్స్ డేని పురస్కరించుకొని, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ వ్యాప్తంగా 30 రోజుల పాటు 30 పట్టణాల్లో 'ఒయాసిస్ జనని యాత్ర' పేరిట ఉచిత మొబైల్ ఫర్టిలిటి క్యాంప్ నిర్వహించనుంది. ఈ కార్యక్రమాన్ని ఒయాసిస్ ఫెర్టిలిటీ యొక్క సైంటిఫిక్ హెడ్ మరియు క్లినికల్ ఎంబ్రియాలజిస్ట్ డాక్టర్ కృష్ణ చైతన్య ఎం, ఒయాసిస్ ఫెర్టిలిటీ యొక్క రీజినల్ మెడికల్ హెడ్ మరియు ఫెర్టిలిటీ స్పెషలిస్ట్ డాక్టర్ జలగం కావ్య రావు మరియు ఇతర ప్రముఖులు ప్రారంభించారు.

తెలంగాణలో సంతానోత్పత్తి రేట్లు 1.5కి తగ్గడంతో 2.1 భర్తీ పరిమితి కంటే చాలా తక్కువగా వంధ్యత్వం పెరుగుతున్నప్పటికీ తరచుగా విస్మరించబడే ప్రజారోగ్య సమస్యగా మారింది. చాలా కుటుంబాలకు, సంతానోత్పత్తి చికిత్సను పొందడం అంటే సుదూర నగరాలకు ప్రయాణించడం, ఈ ప్రయాణం ఆర్థిక ఒత్తిడిని మాత్రమే కాకుండా భావోద్వేగ మరియు రవాణా సవాళ్లను కూడా తెస్తుంది, ముఖ్యంగా చికిత్స చాలా నెలలుగా కొనసాగినప్పుడు. ఇంటికి దగ్గరగా అందుబాటులో ఉన్న, అధికనాణ్యత సంతానోత్పత్తి సంరక్షణ యొక్క అత్యవసర అవసరాన్ని ఇది హైలైట్ చేస్తుంది. దీనికి స్పందనగా, 'ఒయాసిస్ జనని యాత్ర' అనేది ప్రజల్లో తరచూ నిర్లక్ష్యం చేయబడే సంతానలేమి కారణాలపై అవగాహన పెంచడమే లక్ష్యంగా రూపుదిద్దుకున్న అవగాహన కార్యక్రమం, జీవనశైలి మార్పులు చేసుకోవాల్సిన తక్షణావసరంపై ఈ కార్యక్రమంపై ప్రజల్లో అవగాహన పెంచనుంది. ఈ అవుట్రీచ్ ప్రోగ్రామ్ కింద అత్యాధునిక సదుపాయాలతో కూడిన మొబైల్ ఫెర్టిలిటీ క్లినిక్ హైదరాబాద్ నుంచి ద్వితీయ, తృతీయ శ్రేణి పట్టణాలకు పర్యటించనుంది. పునరుత్పత్తి (ఫర్టిలిటి) ఆరోగ్యంపై కీలక సంభాషణలు ప్రజల్లో చోటు చేసుకునేలా చేస్తుంది. ఈ యాత్ర అనుభవం కలిగిన సంతాన సాఫల్య నిపుణులతో ఉచిత సంప్రదింపులతో పాటు మహిళలకు ఉచిత ఏఎంహెచ్, హీమోగ్లోబిన్ టెస్టులను మరియు పురుషులకు ఉచిత వీర్య విశ్లేషణలు అందించనుంది సురక్షిత, పరిశుభ్రమైన శాంపుల్ కలెక్షన్ జోన్లను సంస్థ ఏర్పాటు చేసింది. ముఖ్యంగా సంతానలేమిపై ఇంటరాక్టివ్ సెషన్స్ నిర్వహించనుంది.

వయస్సు, ఒత్తిడి, ఆహారం, నిద్ర, పర్యావరణ విషతుల్యాలు, పిల్లలు పుట్టడంలో జాప్యం వంటి అంశాలపై అవగాహన పెంచనుంది. పురుషులలో వంధ్యత్వ సమస్యలు గణనీయంగా పెరగడం ఆందోళన కలిగించే అంశాలలో ఒకటి. ఆధునిక కాలపు ఒత్తిళ్లు, జీవనశైలి, పోషకాలు సరిగా తీసుకోకపోవడం, కాలుష్యాలకు గురి కావడం, డిజిటల్ ఉపకరణాలను పరిమితికి మించి ఉపయోగించడం లాంటివన్నీ దీనికి కారణాలుగా నిలుస్తున్నాయి. సంతానలేమి కేసుల్లో మగవారి అంశాలే 4050% దాకా ఉంటున్నప్పటికీ, దాన్ని మాత్రం ప్రజలు చాలా తక్కువగానే అర్థం చేసుకున్నారు. సమాజంలో ఉన్న అపోహలు, అవగాహన లోపం కారణంగా ఈ అంశాన్ని విస్మరిస్తున్నారు. సైన్స్ ఆధారిత సమాచారాన్ని నేరుగా ప్రజలకు అందించడం ద్వారా ఒయాసిస్ జనని యాత్ర ప్రజల్లో ఉన్న అపో హలను తొలగించనుంది. జీవనశైలి సంబంధిత సంతానరాహిత్యం పెరుగుతున్న నేపథ్యంలో స్త్రీ, పురుషులకు ఈ అంశంపై సాధికారత కల్పించనుంది. వారు తమ పునరుత్పత్తి ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు ముందుకు వచ్చేలా చేస్తుంది. బహుముఖ కార్యాచరణ మరియు పటిష్ఠ రీతిలో ప్రభుత్వ సంస్థలతో కలసి పని చేయడం ద్వారా ఈ కార్యక్రమం సహానుభూతి, ఎవిడెన్స్ బేస్డ్ సంతాన సాఫల్య పరిష్కారాలు వరంగల్, హన్మకొండ వంటి ఈ తరహా సేవలు అంతగా అందని ప్రాంతాలకు చేరుకునేలా చేస్తుంది. ఈ ప్రాంతాల్లో సంతాన సాఫల్య చికిత్సకు యాక్సెస్ పొందడం, అవగాహన లాంటి వాటిలో ఎంతో అంతరం ఉంది. అత్యాధునిక మొబైల్ ఫెర్టిలిటీ క్లినిక్ ను ప్రారంభించడంతో పాటుగా, ఈ కార్యక్రమం కింద వాకథాన్ కూడా జరి గింది సంతానలేమి గురించి, అధునాతన, సైన్స్ సారథ్యంలోని సంతాన సాఫల్య చికిత్సలు, ప్రిజర్వేషన్ ఎంపి కలపై అవగాహన పెంచడం దీని లక్ష్యం. స్థానికంగా వివిధ వర్గాలకు చెందిన ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నా రు. విద్యార్థులు, కుటుంబాలు, మహిళా గ్రూపుల సభ్యులు, ఆరోగ్య సంరక్షణ వృత్తినిపుణులు వీరిలో ఉన్నారు. ప్రజలతో మమేకం అయ్యేందుకు శక్తివంతమైన వేదికగా ఈ వాకథాన్ అర్థవంతమైన చర్చలకు స్థానం కల్పించిం ది. ఎంతో కాలంగా ఉన్నఅపోహలను పటాపంచలు చేసింది. పునరుత్పత్తి ఆరోగ్యంపై ప్రజలు చర్చించుకునేలా చేసింది. ఈ సందర్భంగా ఒయాసిస్ ఫెర్టిలిటీ యొక్క సైంటిఫిక్ హెడ్ మరియు క్లినికల్ ఎంబ్రియాలజిస్ట్ డాక్టర్ కృష్ణ చైతన్య ఎం మాట్లాడుతూ, "జీవనశైలి కారకాలు మరియు ఆలస్యమైన కుటుంబ నియంత్రణ కారణంగా సంతానోత్పత్తి సవాళ్లు యువతను ఎక్కువగా ప్రభావితం చేస్తున్నాయి. అనేక టైర్ 2 మరియు 3 పట్టణాలలో, పరిమిత అవగాహన మరియు ప్రత్యేక సంరక్షణకు ప్రాప్యత ఆలస్యంగా రోగ నిర్ధారణ మరియు చికిత్సకు దారితీస్తుంది. ఒయాసిస్ జనని యాత్ర ద్వారా, పునరుత్పత్తి శాస్త్రంలో తాజా పురోగతుల ద్వారా శక్తిని పొంది, నిపుణుల సంతానోత్పత్తి సంరక్షణ మరియు విద్యను నేరుగా పేద వర్గాలకు తీసుకురావడం ద్వారా మేము దీనిని మార్చాలని లక్ష్యంగా పెట్టుకున్నాము. ఇది చికిత్స గురించి మాత్రమే కాదు ఇది తల్లిదండ్రుల వైపు వారి ప్రయాణంలో జంటలకు విశ్వాసాన్ని పెంపొందించడం మరియు బలమైన మద్దతు వ్యవస్థను అందించడం గురించి, ఇవన్నీ వారు నిజంగా సైన్స్ చేతుల్లో ఉన్నారని నిర్ధారించుకుంటూనే. ఒయాసిస్ ఫెర్టిలిటీ రీజనల్ మెడికల్ హెడ్, ఫెర్టిలిటీ స్పెషలిస్ట్ డాక్టర్ జలగం కావ్యరావు మాట్లాడుతూ, "సంతానలేమి అనేది ఇకపై ఒక వైద్యపరమైన అంశం మాత్రమే కాదు. పెరిగిపోతున్న జీవనశైలి సంబంధిత ఆందోళన కూడా. పీసీఓడీ, తల్లిదండ్రులు కావడంలో జాప్యం, ఒత్తిళ్లు వంటి వాటితో ముడిపడి ఉన్న కేసులు పెరిగిపోతున్న సందర్భంలో సత్వర డయాగ్నసిస్ ఎంతో ముఖ్యం. ఒయాసిస్ జనని యాత్ర ద్వారా మేం నిపుణుల సంరక్షణను, అధునాతన సంతాన సాఫల్య పరిష్కారాలను ప్రతీ గుమ్మం వద్దకు తీసుకెళ్లగలుగుతు న్నాం, మరీ ముఖ్యంగా ఈ తరహా సదుపాయాలు అంతగా అందుబాటులో లేని ప్రాంతాల్లో. తద్వారా సకాలం లో వారికి అండగా నిలుస్తూ, తల్లిదండ్రులం కావాలనే కోరిక ఫలించేలా చేస్తున్నాం. అవగాహనను అందుబాటుతో మిళితం చేయడం ద్వారా, ఆయా వ్యక్తులు తమ పునరుత్పత్తి ఆరోగ్యంపై అవగాహనతో కూడిన నిర్ణయాలు తీసుకోగలిగేలా సాధికారికతను అందిస్తున్నాం'' అని అన్నారు.ఈ కార్యక్రమం WOGS అధ్యక్షురాలు డాక్టర్ శ్రీలక్ష్మి మరియు విశిష్ట సభ్యులు డాక్టర్ అంజని దేవి, డాక్టర్ గ్లోరీ డేవిడ్, డాక్టర్ రమ్య, డాక్టర్ స్ఫూర్తిల గౌరవనీయమైన హాజరుతో విజయవంతంగా నిర్వహించబడింది, ఈ సందర్భానికి వారి సహకారం ఎంతో విలువైనది.ఈ కార్యక్రమం అందరికీ అందుబాటులో ఉండడం, సైన్స్ ఆధారిత సంరక్షణపై ఒయాసిస్ ఫెర్టిలిటీ అంకిత భావాన్ని చాటిచెబుతుంది. మేం విస్తృతశ్రేణి సంతానలేమి సవాళ్లను సక్రమంగా నిర్వహించి, లక్షకు పైగా ఆరోగ్యవంతమైన శిశువుల జననానికి కారణమ య్యాం. ఛాఫాఈవం వంటి వినూత్నతలను ఉప యోగించడం ద్వారా, సంక్లిష్ట కేసుల్లో సైతం మేం అధిక సక్సెస్ రేటును అందించగలుగుతున్నాం. మీరు ఇప్పుడు గానీ లేదా కొంతకాలం తరువాతైనా గానీ శిశువును పొందాలని భావిస్తుంటే, ఆలస్యం చేయవద్దు - సత్వర అవగాహన, ఆచరణ ముఖ్యం. ఒయాసిస్ ఫెర్టిలిటీ లో మీరు ఇన్ ద గుడ్ హ్యాండ్స్ ఆఫ్ సైన్స్ ఉంటారు, తల్లిదండ్రులు కావాలనే కలను నిజం చేసుకునేందుకు ఓ మార్గం పొందగలుగుతారు. జనని యాత్రలో చేరండి, ఇక్కడ ప్రతి ప్రయాణం కూడా ఒక ఆశతో మొదలవుతుంది.

# కేటీఆర్ సమక్షంలో బిఆర్ఎస్‌లో చేరిన ఎంపీ కాంటెస్ట్ స్వతంత్ర అభ్యర్థి షేక్ మహ్మద్ రసూల్


**200 మంది అనుచరులతో.. 50 కారులతో భారీ ర్యాలీ**

**ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:**



ఖమ్మం జిల్లా తల్లాడలో మాజీ మంత్రి బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ పర్యటించారు. మిట్టపల్లి లో జరిగిన బహిరంగ సభ వేదికపై బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమక్షంలో ఖమ్మం ఎంపీ స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన ముస్లిం మైనార్టీ నేత షేక్ మహ్మద్ రసూల్ 200 మంది అనుచరులతో కేటీఆర్ చేతుల మీదుగా గులాబీ కండువా కప్పుకొని బి ఆర్ ఎస్ పార్టీలో చేరారు. అంతకు ముందు మహమ్మద్ రసూల్ 200 మంది అనుచరులతో 50 కార్లతో ఖమ్మం నుండి తల్లాడ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కేటీఆర్ బిఆర్ఎస్ పార్టీలో మహ్మద్ రసూల్ కు సముచితమైన స్థానం ఇస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మహమ్మద్ హమ్మద్ రసూల్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం సాధించిన పార్టీ బిఆర్ఎస్ పార్టీయేనని విజన్ గల నాయకుడు కేసీఆర్ మాత్రమే తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా ఉండాలంటే అది కేసిఆర్ కేటీఆర్ వల్లనే సాధ్యమని అందుకే బిఆర్ ఎస్ పార్టీలో చేరానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ జిల్లా అధ్యక్షులు తాతా మధు మాజీ మంత్రి పువ్వాడ అజయ్ ఖమ్మం నగర అధ్యక్షులు పగడాల నాగరాజు,పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్టీలో జాయిన్ అయినవారు మహమ్మద్ రసూల్ ఎంపీ కంటెస్టెడ్ అభ్యర్థి, షేక్ సుభాని సిపిఐ ఖమ్మం 14 డివిజన్ నాయకులు, సలీం పాషా, చాంద్ పాషా, డి రవీందర్ టిఆర్ఎస్ పార్టీలో జాయిన్ అయ్యారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక




# జిల్లాలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్న జిల్లా అధ్యక్షులు దుర్గ ప్రసాద్

**ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:** ఖమ్మం జిల్లాలో పార్టీ బలోపేతానికి నిరంతరం కృషి చేస్తున్న జిల్లా అధ్యక్షులు దుర్గాప్రసాద్ కి అలాగే వైరా నియోజకవర్గంలో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళుతున్న వైరా శాసనసభ్యులు రాందాస్ నాయక్ కు ప్రత్యేక అభినందనలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా దళిత రత్న అవార్డు గ్రహీత మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ జిల్లా కాంగ్రెస్ నాయకులు వేల్పుల మురళి విలేకరుల సమావేశంలో తెలిపారు ఇలాంటి గొప్ప నాయకులు వల్ల జిల్లాలో వేరే పార్టీకి తావు లేకుండా ప్రతి గ్రామపంచాయతీ నుండి ప్రతి ఎంపీటీసీ నుండి ప్రతి వార్డు నుండి జిల్లా ప్రజలందరూ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క కు రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు పంచాయతీలు ఎంపీటీసీను గెలిపించి కానుకగా ఇవ్వాలని వారు తెలిపారు దళితుల అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారని దానిలో భాగమే రాజీవ్ యువ వికాస పథకం ప్రవేశపెట్టి అట్టడుగు వర్గాల్లో ఉన్న పేద ప్రజలకు ఎస్సీ ఎస్టీ బీసీలకు ముస్లిం మైనార్టీలకు పేద వర్గాలు బడుగు బలహీన వర్గాలను ముందుకు తీసుకెళ్లాలని ఆర్థికంగా బలోపేతం చేయాలని ఈ పథకం ప్రవేశపెట్టినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి జిల్లా ఎస్సీ విభాగం నుంచి కృతజ్ఞతలు వేల్పుల మురళి తెలిపారు ఈ అవకాశాన్ని అందరూ ఉపయోగించుకొని ఆర్థికంగా నిలబడాలని వారి కుటుంబాలను కాపాడుకొని అభివృద్ధి చెందాలని విలేకరుల సమావేశంలో ఏర్పుల మురళి తెలిపారు.

# విద్యార్థులు నచ్చిన సబ్జెక్టు ఎంచుకోవాలి

- టీజీవీపీ జిల్లా కార్యదర్శి కేదార్నాథ్



**వనపర్తి,తెలంగాణ ముచ్చట్లు:** పదవ తరగతి,ఇంటర్మీడియట్ పూర్తిచేసిన విద్యార్థులు తమకు నచ్చిన సబ్జెక్టును ఎంచుకుని భవిష్యత్తును ఆ దిశగా నిర్మించుకోవాలని తెలంగాణ విద్యార్థి పరిషత్ (టీజీవీపీ) వనపర్తి జిల్లా కార్యదర్శి ఉడుత కేదార్నాథ్ యాదవ్ సూచించారు. శనివారం ఓ ప్రకటనలో ఆయన మాట్లాడుతూ.. కళాశాలల్లో అడ్మిషన్ తీసుకునే ముందు అక్కడి ఆధ్యాపక బృందం, వసతి, హాస్టల్ సదుపాయాలను పరిశీలించాలి అని తెలిపారు. అవసరమైన సదుపాయాలు లేని కళాశాలల్లో చేరి సర్టిఫికెట్లు తీసుకుని ఇబ్బందులు పడకూడదని ఆయన హెచ్చరించారు. విద్యార్థులకు అవసరమైతే టీజీవీపీ హెల్ప్ లైన్ నెంబర్లు 7386820819,9959395310 ద్వారా సలహాలు పొందవచ్చని తెలిపారు.

# పార్టీ సంస్థగత నిర్మాణానికి పాటుపడదాం

- జిల్లా అధ్యక్షులు కోటేశ్వరరావుతో కలిసి సమావేశం



**ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:** భారతీయ జనత పార్టీ సంస్థగత నిర్మాణానికి కార్యకర్తలు సైనికుల్లా పనిచేద్దామని ఆ పార్టీ జిల్లా సంఘటన సంరచన ప్రభారీ పొనుగోడు పాపారావు పిలుపునిచ్చారు. బీజేపీ సంఘటనసంరచన కార్యక్రమం పార్టీ జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు అధ్యక్షతన శనివారం ఖమ్మం జిల్లా పార్టీ కార్యాలయంలో జరిగింది. ఈ కార్యక్రమానికి పాపారావు ముఖ్య అతిధిగా హాజరై పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేసారు. దేశంలో బీజేపీ నేతృత్వంలో ఇప్పటికే చారిత్రాత్మక కార్యక్రమాలు జరుగుతున్నాయని, ఆపరేషన్ సిందూర్ అందుకు నిదర్శనం అన్నారు. దేశ అభివృద్ధి కోసం ప్రధాని నరేంద్ర మోడీ సంరచన నిర్వహిస్తున్నారని, ఆయనను ఆదర్శంగా తీసుకొని పార్టీ పటిష్టత కోసం కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని కోరారు. జిల్లాలోని అన్ని నియోజక వర్గాలు, మండలాల్లో పార్టీ శ్రేణులు కలిసికట్టుగా పని చేసి నియోజకవర్గ, మండల కమిటీలతో పాటు బూతు లెవల్ కమిటీలను త్వరితగతిన పూర్తి చేయాలని, తద్వారా రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఈవీ. రమేష్, సన్నే ఉదయ్ ప్రతాప్, ఖమ్మం అసెంబ్లీ కన్వీనర్ అల్లిక అంజయ్య, ఖమ్మం అసెంబ్లీ నియోజకవర్గం లోని అన్ని మండలాల అధ్యక్షులు, ముఖ్య నేతలు తదితరులు పాల్గొన్నారు.

# ఉరేసుకొని విద్యార్థిని ఆత్మహత్య.. అసలు కారణం ఏంటంటే



**ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:**

కుర్నవల్లి గ్రామంలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. బీటెక్ థర్డ్ ఇయర్ చదువుతున్న విద్యార్థిని ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. తల్లాడ మండలం కుర్నవల్లి గ్రామానికి చెందిన ఆయిలూరి శశి రెడ్డి ఆయన భార్య ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకులో ఉద్యోగం చేస్తున్నారు. ఈ దంపతులకు ఇద్దరు కూతుళ్లు కాగా వీరిలో ఆయిలూరి భావన (22)రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలోని గురునానక్ యూనివర్సిటీలో బీటెక్ థర్డ్ ఇయర్ చదువుతూ ఉంది. ఉన్నట్టుండి శనివారం ఉదయం 10 గంటల సమయంలో హాస్టల్లో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. విద్యార్థిని ఆత్మహత్య పై ఇప్పటి వరకు ఎలాంటి కారణాలు తెలియరాలేదు. ఆమె మృతిపై కుర్నవల్లి గ్రామంలో తీవ్ర విషాదం నెలకొంది.




## జర్నలిస్టులే లక్ష్యంగా దాడిచేయడం దుర్మార్గచర్య

# ఏపీ ప్రభుత్వ తీరును నిరసిస్తూ కదం తొక్కిన జర్నలిస్టులు

### సాక్షి ఎడిటర్ ధనుంజయ్‌రెడ్డి ఇంటిపై దాడిని ముక్తకంఠంతో ఖండించిన జర్నలిస్ట్ యూనియన్‌లు

**ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:**

జర్నలిస్ట్ ల లక్ష్యంగా దాడిచేయడం దుర్మార్గచర్యని, సాక్షి ఎడిటర్ ధనుంజయ్‌రెడ్డి ఇంటిపై ఏపీ ప్రభుత్వం పోలీసులతో దౌర్జన్యానికి పాల్పడటాన్ని ఖండిస్తూ జర్నలిస్ట్ సంఘాలు ముక్తకంఠంతో నిరసనను వ్యక్తం చేశాయి. ఏపీ ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలతో జర్నలిస్టులను భయభ్రాంతులకు గురి చేయాలని చూస్తోందని విమర్శించారు. సాక్షి ఎడిటర్ ధనుంజయ్‌రెడ్డి ఇంటిపై ఏపీ పోలీసులు దాడిని ఖండిస్తూ శుక్రవారం జర్నలిస్ట్ సంఘాల ఆధ్వర్యంలో జెడ్పీకార్యాలయం నుంచి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వరకు నిరసన ప్రదర్శన నిర్వహించారు. నల్ల బ్యాడ్జీల ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఏపీ ప్రభుత్వ చర్యలను ఖండిస్తూ నినాదాలు చేశారు. పత్రికా స్వేచ్ఛపై, జర్నలిస్ట్లపై ప్రభుత్వాల తీరును తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా సంఘాల నేతలు ప్రసంగించారు.

**జర్నలిజంపై ముప్పేటదాడి..**

టీయూడబ్ల్యూజే (టీజేఎఫ్) జిల్లా అధ్యక్షులు ఆకుతోట ఆదినారాయణ మాట్లాడుతూ ప్రజాస్వామ్యానికి మూల స్తంభమైన జర్నలిస్ట్ వ్యవస్థపై తెలుగు రాష్ట్రాల్లో దాడి జరుగుతోందన్నారు. అధికారంలో ఉన్న ప్రభుత్వాలు వారికి అనుకూలంగా మాత్రమే వార్తలు రాయాలని పత్రికలు, విలేకరులు, ఎడిటర్ల పై దాడులు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధానంగా విజయవాడలో సాక్షి ఎడిటర్ ధనుంజయ్‌రెడ్డి ఇంట్లోకి పోలీసులు అక్రమంగా జొరబడటం శోచనీయమన్నారు. ఎడిటర్‌కే రక్షణ లేనప్పుడు సామాన్య జర్నలిస్టు పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. జర్నలిస్ట్ వ్యవస్థకు సంకెళ్లు వేయాలని చూస్తున్న పాలక వర్గాలపై ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఇలాంటి దాడులను టీయూడబ్ల్యూజే (టీజేఎఫ్) ఖండిస్తోందన్నారు.

**మీడియా స్వేచ్ఛను హరిస్తున్నారు..**

టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి ఏనుగు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మీడియా స్వేచ్ఛను ప్రభుత్వాలు హరిస్తున్నాయన్నారు. ఇటీవలి కాలంలో జర్నలిస్ట్లపై దాడులు పెరిగాయని పేర్కొన్నారు. తమకు అనుకూలమైన వార్తలు ప్రచురించని పత్రికలు, ఛానల్స్‌పై రాజ్యాధికారాన్ని ఉపయోగించి దాడులకు పాల్పడుతున్నారన్నారు. ఈ దాడులను యావత్తు జర్నలిస్ట్ సమాజం ఖండిస్తోందని తెలిపారు. సాక్షి ఎడిటర్ ధనుంజయ్‌రెడ్డి ఇంటిపై జరిగిన దాడికి ప్రభుత్వం క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో మీడియా వర్గాలపై దాడులు జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

**సాక్షి ఎడిటర్ ఇంటిపై దాడి హాస్యాస్పదం..**

టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ .. మీడియా స్వేచ్ఛమీద, వ్యక్తిగత స్వేచ్ఛ మీద దాడులు కొనసాగుతున్నాయన్నారు. సాక్షి ఎడిటర్ ధనుంజయ్‌రెడ్డి ఇంటిపై కక్షపూరిత వైఖరితో, అక్కడి ప్రభుత్వానికి వ్యతిరేకంగా వార్తలు రాస్తున్నారని దాడి చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. దీనిని టీడబ్ల్యూజేఎఫ్ ఖండిస్తోందన్నారు. ధనుంజయ్‌రెడ్డి ఏమైనా నేరాలు చేశారా.. అటువంటివి ఏమీ లేకుండా కేవలం జర్నలిస్ట్లను బెదిరించాలి.. వారిని అనుకూలంగా మలచుకోవాలనే వైఖరితో భయభ్రాంతులకు గరి చేయడం కోసం ఇటువంటి చర్యలకు పాల్పడటం సరికాదన్నారు. అక్కడ ఉన్న జర్నలిస్ట్లను లక్ష్యంగా చేసుకుని దాడులు చేయడం దుర్మార్గమైన చర్య అన్నారు. వాస్తవాలు రాసిన జర్నలిస్ట్లపై ఇటువంటి చర్యలకు పాల్పడటం సరికాదని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే (టీజేఎఫ్) జిల్లా ప్రధాన కార్యదర్శి చిర్రా రవి, బాధ్యులు గుద్దేటి రమేష్, కొరకొప్పుల రాంబాబు, యలమందల జగదీష్, టీఎస్ చక్రవర్తి, టీయూడబ్ల్యూజే (ఐజేయూ) నగర అధ్యక్షుడు మైసా పాపారావు, కార్యదర్శి చెరుకుపల్లి శ్రీనివాస్, బాధ్యులు మోహిద్దీన్, శివానంద, టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా నాయకులు సయ్యద్ ఖదీర్, దువ్వా సాగర్, ఆవుల శ్రీనివాస్, కూరాకుల గోపి, వేగినాటి మాధవరావు, మహిళ ప్రతినిధులు వంగూరి ఈశ్వరి,మధుశ్రీ, సాక్షి ఎడిషన్ ఇంచార్జి కేశవ్, బ్రాంచిమేనేజర్ మోహన్‌క్రిష్ణ, సాక్షిటీవీ స్టాఫర్ పి.మహేందర్‌కుమార్, సాక్షి ఏసీఎం శ్రీనివాస్, సీనియర్ జర్నలిస్ట్ మారెడ్డి నాగేందర్‌రెడ్డి, సాక్షి సిబ్బంది పాల్గొన్నారు. ఏఐఎస్ఎఫ్, పీడీఎస్‌యు జిల్లా ప్రధాన కార్యదర్శులు ఇటికాల రామకృష్ణ, వంగూరి వెంకటేష్‌లు ఈ నిరసనకు సంఘీభావం తెలిపారు.





# 3 రోజులలో మస్తానీ కుంటకు నీరు విడుదల..

- రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళీ శాఖల మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరరావు
- మంచుకొండ ఎత్తిపోతల పథకాన్ని పరిశీలించిన మంత్రి తుమ్మల

**ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:** మంచుకొండ ఎత్తిపోతల పథకం ద్వారా మూడు రోజులలో మస్తానీ కుంటకు నీరు విడుదల చేయాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళీ శాఖల మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం మంత్రి రఘునాథపాలెం మండలం గడ్డికుంట తండా వద్ద గల గ్రావిటీ 5 కేనాల్, బావోజితండా వద్ద గల రేగులకుంట చెరువు సందర్శించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ మంచుకొండ ఎత్తిపోతల పథకం ట్రయల్ రన్ ద్వారా చెరువులకు నీటి విడుదల చేపడుతున్నామని తెలిపారు. రేగుల కుంట చెరువు నుండి నీరు సర్ ప్లస్ అయి నల్లకుంట చెరువు, మల్లెపల్లికు చేరుకుంటున్నాయని అన్నారు. 3 రోజుల వ్యవధిలో మస్తానీకుంట, మంచుకొండకు నీరు విడుదల చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు.

రూ. 66.33 కోట్ల ఖర్చుతో మంచుకొండ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ చేపట్టామన్నారు. తక్కువ ఖర్చుతో అధికంగా ఆయకట్టు సాగు పనులకు ప్రభుత్వం ప్రాధాన్యత నిస్తూ, మంచుకొండ ఎత్తిపోతల పథకాన్ని యుద్ధప్రాతిపదికన పూర్తికి చర్యలు తీసుకున్నామన్నారు. ఈ ప్రాజెక్ట్ తో 2400 పైగా ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందుతుందన్నారు. కొత్త పనులను చేపట్టి, ప్రతి ఎకరాకు సాగునీరు అందించే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు తెలిపారు. రైతుల సహకారంతో పైప్ లైన్ వేయడం పూర్తిచేస్తున్నట్లు, రాబోయే వానాకాలం పంట సీజన్ నుండి మంచుకొండ ఎత్తిపోతల పథకం క్రింద సాగు నీరు సరఫరా చేస్తామని మంత్రి అన్నారు. Bఈ పర్యటనలో మంత్రి వెంట జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య, ఖమ్మం ఆర్డీవో జి. నర్సింహారావు, ఇరిగేషన్ ఇఇ అనన్య, డిఇ ఝాన్సీ, ఏడిఏ వెంకటేశ్వర రావు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



నన్ను మోసింది నువ్వే
నా తొలి గుండె చప్పుడుకి
చిరునామా నువ్వే..
నన్ను కన్నది నువ్వే
నాకోసం కలలు కన్నది నువ్వే...
నన్ను ఎత్తుకుంది నువ్వే
నీ గుండెలకు హత్తుకుంది నువ్వే...
నీ రొమ్ము పాలు ఇచ్చింది నువ్వే
నీ ప్రేమలోని మురిపాలు పంచింది
నువ్వే...
నన్ను ఆడించింది నువ్వే
నన్ను ఆట పట్టించింది నువ్వే..
నన్ను పెంచింది నువ్వే
నీ రక్తం పంచింది నువ్వే...
నన్ను బడికి పంపింది నువ్వే
నాకు తెలిసిన తొలి గురువు
నువ్వే...
నన్ను చదివించింది నువ్వే
నాకు జీవితాన్ని నేర్పించింది
నువ్వే...
నాదైన గుణము నువ్వే
నాలోని ప్రాణం నీ నవ్వే .
లవ్ యూ అమ్మా....

**- బొమ్మకంటి మహేందర్**

సాఫ్ట్వేర్ ఇంజనీర్, గ్రామం :కొప్పుల,
మండలం :శాయంపేట
జిల్లా :హనుమకొండ, 7032078727



నవమాసాలలో నవ్యత తానై..!
ఉగ్గు పాలలో ఊపిరి తానై ..!
బోసినవ్వులో వెలుగులు తానై..!
బుడిబుడి నడకలో బాల్యం తానై..!
ఆప్యాతలకు చిరునామా తానై..!
అనురాగాలకు మమతల కోవెల
తానై..!
అల్లరికి అంతః సైన్యం తానై..!
ఆలనా పాలనాకు అమృతమూర్తి
తానై..!
చిరుకోపాల చిరు దీవెన తానై..!
కష్టాల గాయానికి లేపనం తానై..!
అన్నీ తానై ,అంతటా తానై..!
తన తనువును నిచ్చెన చేసి
నీ ఉన్నతిని కలకంటుంది..!
స్వంత జీవితం తెలియని
తెలివైన అమాయకపు జీవి తాను..!
నీ ఎదుగు దలలోనే తాను
జీవిస్తుంది..!
నీ సుఖ సంతోషాలే తన కష్ట
సుఖాలు ..!
మరువకోయి
కన్న తల్లిని..మాతృ భూమిని..!
మరిచి నిలవకోయి
స్వార్థం సమాజం లో...!
తల్లి రుణం తీర్చుకో గర్వంగా తల
ఎత్తుకో ..పుత్ర రత్నమా..!

అంశం: మాతృ దినోత్సవం
**కాకర్ల రమణయ్య**
ఊరు గుడిపాటిపల్లి, ఆంధ్రప్రదేశ్

# కాల్పుల విరమణను స్వాగతించిన మాజీ ఎంపీ కవిత

- దేశాన్ని రక్షించడానికి భారత సైన్యం ధైర్యంగా పోరాటం చేసింది
- అమెరికా మధ్యవర్తిత్వం ఎందుకు ?
- ప్రత్యేక పార్లమెంటు సమావేశాలు నిర్వహించి అన్ని అంశాలను కేంద్రం ప్రజలకు వివరించాలి
- మాజీ ఎంపీ, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత




**హైదరాబాద్ :** భారత్, పాకిస్తాన్ మధ్య కాల్పుల విరమణను మాజీ ఎంపీ, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత స్వాగతించారు. పాకిస్తాన్ చేసిన దాడుల్లో వీర మరణం పొందిన సైనికులకు నివాళులు అర్పించారు. దేశాన్ని, దేశ ప్రజలను రక్షించడానికి భారత సైన్యం ధైర్యంగా పోరాటం చేసిందని కొనియాడారు.

భారత్, పాకిస్తాన్ మధ్య నెలకొన్న అంశాల విషయంలో ద్వైపాక్షికంగానే ఎప్పుడూ పరిష్కరించుకునే ప్రయత్నం చేస్తున్న నేపథ్యంలో ఎప్పుడూ లేనివిధంగా అకస్మాత్తుగా అమెరికా ఎందుకు ప్రవేశించి మధ్యవర్తిత్వం వహించాల్సి వచ్చిందో అన్న అంశాలపై కేంద్ర ప్రభుత్వం స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉందని తెలిపారు. భవిష్యత్తులో పాకిస్తాన్ ఇలాంటి దుశ్చర్యకు పాల్పడకుండా ఉండేందుకు మనం ఎంత గట్టిగా నిలవరించగలిగినం అన్న అంశాలపై ప్రధానమంత్రి, రక్షణ శాఖ మంత్రి దేశ ప్రజలకు వివరిస్తే బాగుంటుందే అని ఆమె అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

# దేవరుప్పుల మండల కాంగ్రెస్ అధ్యక్ష అభ్యర్థిగా ఇప్ప పృథ్వి రెడ్డి నామినేషన్

**దేవురుప్పుల,తెలంగాణ ముచ్చట్లు:**

జనగామ జిల్లా దేవరుప్పుల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష పదవికి ఇప్ప పృథ్వి రెడ్డి నామినేషన్ దాఖలు చేశారు. పార్టీ సంస్థాగత ఎన్నికల నేపథ్యంలో ఆయన నామినేషన్ దాఖలు చేయడం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది.

ఈ సందర్భంగా పృథ్వి రెడ్డి మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాకముందు పార్టీ గెలుపుకోసం శ్రమించిన వారికి ఇప్పటిదాకా తగిన గుర్తింపు రాలేదన్నారు. అధికారం వచ్చిన తరువాత ఇతర పార్టీల నుంచి వచ్చినవారే పదవులు చేపట్టి కొనసాగుతున్నారన్న విషయాన్ని అధిష్టానం గమనించిందని చెప్పారు. ప్రస్తుతం జరుగుతున్న సంస్థాగత ఎన్నికల్లో పార్టీ కోసం నిజంగా కృషి చేసినవారికే పదవులు దక్కే అవకాశం ఉందని అభిప్రాయపడ్డారు.

పార్టీ పటిష్టత కోసం నిబద్ధత కలిగిన, సమర్థత ఉన్న యువ నాయకత్వానికే పగ్గాలు అప్పగించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ విజయమే లక్ష్యంగా పనిచేసే తరం నాయకులకు ముందంజ ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఝాన్సీ రెడ్డి, శాసన సభ్యురాలు యశస్వినీ రెడ్డిలకు పృథ్వి రెడ్డి విజ్ఞప్తి చేశారు.



తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
ఆదివారం - 11 - మే - 2025




# సమాజ మార్గదర్శిగా మారుతున్న సోషల్ మీడియా


## ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఎంపి కడియం కావ్య

**స్టేషన్ ఘనపూర్, తెలంగాణ ముచ్చట్లు:**

స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ కేంద్రంలో ఏర్పాటు చేసిన సోషల్ మీడియా వారియర్స్ వర్క్‌షాప్ కార్యక్రమం ఘనవంగా జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే, మాజీ ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి, వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య, టీపీసీసీ సోషల్ మీడియా ఇంచార్జ్ మన్నే సతీష్ పాల్గొన్నారు.

**కడియం శ్రీహరి మాట్లాడుతూ:**

ప్రపంచంలో ఎక్కడ ఏం జరిగినా, క్షణాల్లో తెలిసిపోయే శక్తి సామర్థ్యం సోషల్ మీడియాలో ఉందని చెప్పారు. యువత దీనికి అధికంగా ఆకర్షితమవుతున్నారని, రాజకీయాల్లో సోషల్ మీడియా కీలకంగా









మారిందని వివరించారు. బీఆర్ఎస్ పార్టీ, అధికారాన్ని కోల్పోయిన తరువాత సోషల్ మీడియాను ఆయుధంగా మార్చుకొని అసత్య ప్రచారాలు చేస్తోందని ఆరోపించారు.

ఇలాంటి పరిస్థితుల్లో కాంగ్రెస్ పార్టీ కూడా సోషల్ మీడియా శక్తిని వినియోగించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో మొట్టమొదటి సారిగా స్టేషన్ ఘనపూర్‌లో సోషల్ మీడియా వారియర్స్ వర్క్‌షాప్ నిర్వహించినట్లు తెలిపారు. మండల, గ్రామ స్థాయిలలో నాయకత్వం ఈ వారియర్స్‌కు అండగా నిలవాలని సూచించారు. ప్రభుత్వ పథకాలలో వీరికి ప్రత్యేక ప్రాధాన్యత కల్పిస్తామని హామీ ఇచ్చారు.

**కడియం కావ్య మాట్లాడుతూ:**

ప్రజా సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో సోషల్ మీడియా సమన్వయకర్తలదే కీలక బాధ్యత అని ఎంపీ డా. కడియం కావ్య అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న పథకాలను విస్తృతంగా ప్రచారం చేయాలని, ప్రతి పక్షాల అసత్య ప్రచారాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు.

తన తండ్రి కడియం శ్రీహరి ప్రజాసేవలో మచ్చలేని నాయకుడిగా నిలిచారని, కొందరు అసూయతో అసత్యాలు ప్రచారం చేస్తున్నప్పటికీ ప్రజలు వాటిని నమ్మే స్థితిలో లేరన్నారు. గత 15 ఏళ్లుగా కడియం కుటుంబానికి అండగా నిలుస్తున్న సోషల్ మీడియా వారియర్స్‌కు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. నియోజకవర్గ అభివృద్దే మా లక్ష్యమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలోనియోజకవర్గ ప్రజాప్రతినిధులు, నాయకులు, యువజన కాంగ్రెస్ సభ్యులు, సోషల్ మీడియా వారియర్స్, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



1. అమ్మ అనగానే...
అమ్మ అనగానే ఆకాశంలా వెలిగే వెలుగు,
ఆమె మాటలలో మాధుర్యమే తీయని నెమలి.
నిద్రలేని రాత్రులు గడిపి ముద్దు పెట్టిన అమ్మ,
నవ జీవనానికి రూపం ఆమె ప్రేమే!

2. మాతృ దినోత్సవానికి శుభాకాంక్షలు
అమ్మ ప్రేమకు పోలిక లేదు,
ఆమె త్యాగానికి సాటి లేదు.
ప్రతి ముక్కులో ఆమె అనురాగం,
ప్రతి చూపులో ఆమె కాపాడే కరుణ.

3. అమ్మ కళ్లలో ప్రపంచం
అమ్మ కళ్లలో చూచితే పరమానందం,
ఆమె ఆలింగనంలో భద్రత,
వెన్నెలగా నడిపించే ఆమె ఆశీస్సులు,
ఆమె లేనిదే ఈ జీవితం అసంపూర్ణం.

4. ఓ అమ్మా...
నన్ను నడిపిన తొలి చేతులు నీవే,
నన్ను ముద్దాడిన తొలి పెదవులు నీవే.
నీ చిరునవ్వే నా స్ఫూర్తి,
నీ ప్రేమే నా శ్వాస.

**షేక్ మదార్ సాహెబ్**
తెలంగాణ ముచ్చట్లు
ఉమ్మడి ఖమ్మం బ్యూరో చీఫ్
గ్రామం నేరడ, మండలం చింతకాని
జిల్లా ఖమ్మం, 9440449942



## ఘనంగా రంగు రమేష్ గౌడ్ జన్మదిన వేడుకలు

**స్టేషన్ ఘనపూర్,తెలంగాణ ముచ్చట్లు:**

స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా వారియర్ రంగు రమేష్ గౌడ్ జన్మదినాన్ని పురస్కరించుకొని స్థానికంగా వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా మాజీ ఉపముఖ్యమంత్రి, శాసన సభ్యుడు కడియం శ్రీహరి, తెలంగాణ రాష్ట్ర టెక్నాలజీ సర్వీసెస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్, టీపీసీసీ సోషల్ మీడియా చైర్మన్ మన్నె సతీష్ కుమార్ సమక్షంలో కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.కార్యక్రమంలో నియోజకవర్గ స్థాయి కాంగ్రెస్ నాయకులు, సోషల్ మీడియా కార్యకర్తలు పాల్గొని రమేష్ గౌడ్‌కు అభినందనలు తెలిపారు.



## మృతుడి కుటుంబానికి ఇల్లందుల రాజనారాయణ చేయూత

**స్టేషన్ ఘనపూర్, తెలంగాణ ముచ్చట్లు:**

ఇటీవల 12వ వార్డులో మరణించిన తాటికొండ రాజయ్య (బండల్) కుటుంబానికి 50 కిలోల బియ్యాన్ని మానవతా దృక్పథంతో అందించారు. ఈ సహాయాన్ని మాజీ సర్పంచ్ ఇల్లందుల ప్రతాప్ కుమారుడు ఇల్లందుల రాజనారాయణ స్వయంగా వారి నివాసానికి వెళ్లి అందజేశారు. ఇల్లందుల రాజనారాయణ మానవతా హృదయాన్ని ప్రశంసించిన స్థానికులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ 15వ వార్డుసభ్యుడు సింగపురం రమేష్ కుమార్, చింత తిరుపతి, రాడపాక ఆరోగ్యం, మాతంగి కుమార్, నీరటి రత్నాకర్, మాతంగి అశోక్, ఇల్లందుల రాజు, తాటికొండ కుమార్, ఆకారపు అశోక్, ఆకారపు శేషి, చింత లింగయ్య, సింగపురం కిట్టు, సింగపురం అబిలాష్ తదితరులు పాల్గొన్నారు.



## యువజన కాంగ్రెస్ సమీక్షతో ప్రాచుర్యంలోకి తండాలు

**పాలకుర్తి,తెలంగాణ ముచ్చట్లు:**

జనగామ జిల్లా పాలకుర్తి నియోజకవర్గంలోని బోడోని కుంట తండా, చెరువు ముందు తండా, గిర్ని తండా గ్రామాలలో యువజన కాంగ్రెస్ సమీక్ష సమావేశాలు ఏర్పాటు చేశారు. నియోజకవర్గ ప్రజాప్రతినిధి మామిడాల యశస్విని రెడ్డి, నియోజకవర్గ ఇన్‌ఛార్జి హనుమాండ్ల ఝాన్సీరెడ్డి ఆదేశాల మేరకు యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు ధరావత్ రాజేష్‌నాయక్, కొడకండ్ల మండల యువజన అధ్యక్షుడు దూదిమెట్ల యాకేష్‌యాదవ్ ఆధ్వర్యంలో ఈ సమావేశాలు నిర్వహించబడ్డాయి.

ఈ సమావేశాల్లో నాయకులు మాట్లాడుతూ, గ్రామ స్థాయిలో యువ నాయకులు ప్రజల్లోకి వెళ్లి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాల్ని అందరికీ అర్థమయ్యేలా వివరించాలన్నారు. ప్రజల మనస్సుల్లో ప్రభుత్వ పథకాల పట్ల విశ్వాసం పెరిగేలా నిరంతరం కృషి చేయాలని పిలుపునిచ్చారు. తప్పుడు ప్రచారాలతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్న బిఆర్ఎస్ పార్టీకి సమాధానం చెప్పే విధంగా నిబద్ధతతో పనిచేయాలన్నారు.

వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని గ్రామ పంచాయతీ సర్పంచ్ పదవులను గెలిపించుకోవడమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. అలాగే ఎంపీటీసీ, జెడ్పిటీసీ స్థానాలను కాంగ్రెస్ కైవసం చేసుకోవాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు. పార్టీలో శాస్త్రీయంగా, క్రమశిక్షణతో మెలగాలని సూచించారు. ఈ సమావేశాల్లో మండల అధ్యక్షుడు ధరావత్ సురేష్ నాయక్, బోడోని కుంట తండా గ్రామ అధ్యక్షుడు బానోత్ రవి, చెరువు ముందు తండా గ్రామ అధ్యక్షుడు ధరావత్ రవి, గిర్ని తండా అధ్యక్షుడు సుధీర్ తదితరులు పాల్గొన్నారు. అలాగే యువజన నాయకులు ధరావత్ చంద్రు నాయక్, సురేష్, సంతోష్, కృష్ణతో పాటు నియోజకవర్గంలోని పలువురు యువత, కార్యకర్తలు, సోషల్ మీడియా సన్నిహితులు భారీగా హాజరయ్యారు.



## భారత ఆర్మీ క్షేమం కోసం చిల్పూర్ గుట్టలో ప్రత్యేక పూజలు

**చిల్పూర్, తెలంగాణ ముచ్చట్లు:**

దేశ సరిహద్దుల్లో మన రక్షణ కోసం ప్రాణాలను పణంగా పెట్టి పోరాడుతున్న భారత ఆర్మీ క్షేమార్థం చిల్పూర్ మండలంలోని బుగులు వెంకటేశ్వర స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఈ సందర్భంగా జఫర్ గడ్ మండల బీజేపీ అధ్యక్షులు కోరుకొప్పుల నాగేష్ గౌడ్ మాట్లాడుతూ — “భారత ఆర్మీ కోసం పూజలు చేయడం మన ప్రతి పౌరుడి బాధ్యత. వారు ప్రతి అడుగులో విజయం సాధించాలని, దేశ శత్రువులు దొంగచాటుగా చేసే దాడుల్లో కూడా మన ఆర్మీకి ఎలాంటి నష్టం కలగకూడదని, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీసుకునే ప్రతి నిర్ణయానికి దేవుని ఆశీస్సులు ఉండాలి” అని తెలిపారు.

ఈ అర్చన కార్యక్రమాన్ని బీజేపీ, గౌడ యువజన సంఘం సంయుక్తంగా నిర్వహించాయి. ఈ కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షులు మూల మహేష్ గౌడ్, ఎస్సీ మోర్చా చిల్పూర్ మండల అధ్యక్షులు కందుకూరి రజినీకర్, బీజేవైఎం నాయకులు సందీప్ యాదవ్, గౌడ యువజన సంఘం కూనూర్ అధ్యక్షులు కోట సతీష్ గౌడ్, ముప్పిడి సాయి గౌడ్, బబ్బురి కిరణ్ గౌడ్, చిర్ర తిరుపతి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## అవినీతి నిరోధక శాఖకు చిక్కిన లంచగొండి అధికారి

**రాజన్న సిరిసిల్ల,తెలంగాణ ముచ్చట్లు:**

మే 10 రాజన్న సిరిసిల్ల జిల్లా ఇరిగేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఏసీబీ వలకు చిక్కాడు. ఏకంగా రూ. 60,000 లంచం తీసుకుంటూ రెడ్ హ్యాండెడ్‌గా అవినీతి నిరోధక శాఖ అధికారులకు పట్టుబడ్డా డు. రాజన్న సిరిసిల్ల జిల్లా నీటి పారుదల శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఈఈ) గా విధులు నిర్వహిస్తున్న అమరేందర్ రెడ్డి.

రాజన్న సిరిసిల్ల జిల్లాలోని ముస్తాబాద్ మండలం ఆవునూరు వద్ద నిర్మించిన చెక్ డ్యాం బిల్లుల విడుదల కోసం సూరం రవీందర్ అనే కాంట్రాక్టర్ వద్ద లక్ష రూపా యల లంచం డిమాండ్ చేయగా, 75 వేలకు కుదిరింది.

కరీంనగర్ జిల్లా కేంద్రంలోని విద్యారణ్యపురి కాలనీలో నివాసం ఉంటున్న తన ఇంట్లో శుక్రవారం రాత్రి 8 గంటలకు రవీందర్ వద్ద 60 వేల రూపాయల లంచం తీసుకుంటుండగా అవినీతి నిరోధక శాఖ అధికారులకు అమరేందర్ రెడ్డి,ని రెడ్ హండ్రెడ్‌గాపట్టుకున్నారు.



అంతేకాకుండా గతంలోనూ ఇదే కాంట్రాక్టర్ వద్ద సుమారు నాలుగు లక్షల వరకు లంచం తీసుకున్నట్లు సమాచారం. ఈ అధికారి చాలా మంది కాంట్రాక్టర్ల వద్ద అధిక మొత్తంలో లంచాలు తీసుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. అనంతరం కేసు నమోదు చేసి అదుపులోకి తీసుకున్నట్లు ఏసీబీ డిఎస్పి వివరించారు.



## కొత్తగూడెం నియోజకవర్గంలో ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి విస్తృత పర్యటన

### కాంగ్రెస్ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపు

**ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:** ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి శనివారం కొత్తగూడెం నియోజకవర్గంలో ముమ్మరంగా పర్యటించారు. 16వ డివిజన్ లో పాల సత్య నారాయణ రెడ్డి నానమ్మను పరామర్శించారు. ఇటీవల అస్వస్థతకు గురైన మాజీ జడ్పీటీసీ పరం జ్యోతిరావును పరామర్శించారు. చుంచుపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. రైతులకు అండగా ఉంటానని అభయమిచ్చారు. బాబు క్యాంప్ కాలనీలో గొల్ల శ్రీను నివాసం వద్ద, సుజాతనగర్ మండలం రాఘవపురం గ్రామంలో నాగార్జున నివాసం వద్ద కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశాల్లో మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు నిర్వహిస్తోందని, ఈ పథకాలను ప్రజలకు వివరించాలని కోరారు. ఆయా కార్యక్రమాల్లో పలువురు ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# ఆధునిక దంత వైద్యానికి దారి చూపుతున్న నిపుణుడు

# డాక్టర్ నన్నపనేని రాజేష్ డెంటల్ సర్జన్‌తో ప్రత్యేక ఇంటర్వ్యూ

**ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:**

ఇప్పటి జీవనశైలిలో ఆరోగ్య సంరక్షణలో దంత ఆరోగ్యాన్ని కూడా పెద్దపీట వేయాల్సిన అవసరం ఉంది. మనదేశంలో ప్రతిష్ఠాత్మకంగా ఎదుగుతున్న దంత వైద్య రంగంలో అనుభవం, నైపుణ్యం కలిగి వేలాది మందికి మెరుగైన చిరునవ్వును అందించిన డెంటల్ వైద్యరంగంలో 23 ఏళ్ల అపూర్వ అనుభవం గల ఖమ్మంలో ఖజానా జ్యువెలర్స్ పక్కన రాజేష్ డెంటల్ హాస్పిటల్ అధినేత డాక్టర్ నన్నపనేని రాజేష్ , శనివారం మనతో ప్రత్యేకంగా మాట్లాడేందుకు సమ్మతించారు. ఆధునిక చికిత్సా విధానాలను సమర్థవంతంగా అమలు చేస్తూ, ప్రజలలో దంత ఆరోగ్యంపై అవగాహన పెంచేందుకు కృషి చేస్తున్నారు. ఈ ప్రత్యేక ఇంటర్వ్యూలో ఆయన దంత వైద్య రంగంలో ఎదురయ్యే సవాళ్లపై, తాజా చికిత్సా పద్ధతులపై, ప్రజల ఆరోగ్యంపై తన లోతైన అభిప్రాయాలను పంచుకున్నారు.

**ప్రముఖ డెంటల్ సర్జన్ డా. నన్నపనేని రాజేష్ – ప్రస్తుత సమాజంలో దంత సమస్యలపై అవగాహన**





**ప్రతినిధి:** ప్రస్తుత సమాజంలో దంత ఆరోగ్యం పరిస్థితి ఎలా ఉంది?

**డాక్టర్:** ప్రస్తుతం చాలా మంది దంత ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారు. తొందరలో తినడం, చక్కెర పదార్థాలు ఎక్కువగా తీసుకోవడం, రోజూ రెండుసార్లు బ్రష్ చేయకపోవడం వల్ల చిన్న వయస్సులోనే పళ్ల సమస్యలు వస్తున్నాయి.

**ప్రతినిధి:** చిన్నపిల్లల్లో పళ్ల సమస్యలు పెరగడానికి కారణం ఏమిటి?

**డాక్టర్:** పిల్లలు ఎక్కువగా చాక్లెట్లు, స్వీట్ పదార్థాలు తింటున్నారు. తిన్న తరువాత పళ్లు శుభ్రం చేయడం మరిచిపోతున్నారు. దీనివల్ల క్యావిటీల సంఖ్య ఎక్కువవుతోంది. తల్లిదండ్రుల అవగాహన లేకపోవడం కూడా కారణం.

**ప్రతినిధి:** సరైన బ్రషింగ్ పద్ధతి గురించి వివరించగలరా?

**డాక్టర్:** రోజుకు రెండు సార్లు, కనీసం 2 నిమిషాల పాటు బ్రష్ చేయాలి. సాఫ్ట్ బ్రిసిల్ బ్రష్ వాడాలి. పై నుండి కిందకు గానీ, చుట్టూ గానీ సున్నితంగా బ్రష్ చేయాలి. బలంగా రుద్దడం వల్ల ఇనామెల్ దెబ్బతింటుంది.

**ప్రతినిధి:** జంక్ ఫుడ్ పళ్ల ఆరోగ్యంపై ఎలాంటి ప్రభావం చూపిస్తుంది?

**డాక్టర్:** జంక్ ఫుడ్‌లో చక్కెరలు, పిండి పదార్థాలు అధికంగా ఉంటాయి. ఇవి పళ్ల మధ్యన చిక్కుకుపోయి బాక్టీరియా పెరగడానికి అవకాశమిస్తాయి. దీంతో క్యావిటీలు ఏర్పడతాయి.

**ప్రతినిధి:** దంత సమస్యలను నివారించడానికి ఏం చేయాలి?

**డాక్టర్:** శుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలి. మంచి ఆహారపు అలవాట్లు, రెగ్యులర్ బ్రషింగ్, ప్రతి ఆరు నెలలకొకసారి దంత పరీక్ష చేసుకోవాలి.

**ప్రతినిధి:** ఎప్పుడు దంత వైద్యుడిని కలవాలి?

**డాక్టర్:** పళ్లలో నొప్పి, వాపు, రక్తస్రావం, దుర్వాసన మొదలైన లక్షణాలు కనిపిస్తే వెంటనే డాక్టర్‌ను కలవాలి. ఇంకా సమస్యలేమీ లేకపోయినా ఆరునెలకోసారి చెక్‌అప్ చేసుకోవడం మంచిది.

**ప్రతినిధి:** గ్రామీణ ప్రాంతాల్లో దంత అవగాహన ఎలా పెంచవచ్చు?

**డాక్టర్:** స్కూళ్లలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం, ప్రభుత్వ హెల్త్ కాంప్స్ ద్వారా సేవలు అందించడం అవసరం. స్థానికంగా డెంటల్ హెల్త్ ప్రచారాలు చేయాలి.

**ప్రతినిధి:** మీ వద్ద సాధారణంగా కనిపించే కేసులు ఏవీ?

**డాక్టర్:** ఎక్కువగా క్యావిటీలు, గింజల వాపు, విరిగిన పళ్ల మరమ్మత్తులు, రూట్ కెనాల్, బ్రేసెస్, దంతాలు కోల్పోయిన వారికి క్రౌన్, ఇంప్లాంట్ చికిత్సలు చేస్తాం.

**ప్రతినిధి:** యువతకు మీరు ఏ సూచనలు ఇవ్వగలరు?

**డాక్టర్:** ఫ్యాషన్ మీద ఫోకస్ పెట్టే యువత, పళ్ల ఆరోగ్యం మీద కూడా దృష్టి పెట్టాలి. బ్రషింగ్, మౌత్ వాష్, మరియు ఫ్లోసింగ్ అలవాటు చేసుకోవాలి.

**ప్రతినిధి:** మా ప్రేక్షకులకు చివరి సందేశం చెప్పగలరా?

**సమాధానం:** "పళ్లు మన జీవితంలోని భాగం. ఒకసారి దెబ్బతిన్నపుడు పునరుద్ధరించడం కష్టం. కాబట్టి, వాటిని ప్రాముఖ్యతతో చూసుకోండి. ఆరోగ్యంగా ఉండు - నవ్వుతూ ఉండు!"

# పాకిస్తాన్‌కు అంతర్జాతీయ రుణ సంస్థల నుంచి భారీగా అప్పు..!




గతంలో తీసుకున్న అప్పులను పాక్ సక్రమంగా వినియోగించులేదని ఆరోపించింది. ఐఎంఎఫ్ నుంచి నిధులు వస్తూ ఉంటే.. పాక్ వాటిని సైన్యానికి, ప్రభుత్వ ప్రాయోజిత సీమాంతర ఉగ్రవాదుల కోసం వినియోగిస్తుందని భారత్ ధ్వజమెత్తింది. ఆ నిధులను పాక్ సక్రమంగా వినియోగించి ఉంటే ఆ దేశ ఆర్థిక వ్యవస్థ స్థిరంగా ఉండేదని చెప్పుకొచ్చింది భారత్. అంతర్జాతీయ ద్రవ్య నిధి ఎక్స్‌టెండెడ్ ఫండ్ ఫెసిలిటీ (ఐఈఫ్) చివరకు పాకిస్తాన్‌కు రుణం ఇచ్చేందుక అంగీకరించింది. 1 బిలియన్ డాలర్ల(మన కరెన్సీలో దాదాపు రూ.8540 కోట్లు.)అదే పాకిస్థాన్ కరెన్సీలో దాదాపు రూ.28 వేల కోట్ల రుణం అందించడానికి అంగీకరించింది. ఐఎంఎఫ్ పాకిస్తాన్‌కు రుణాలు అందించటంపై భారత్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. రుణ ప్రతిపాదనను ఓటింగ్‌కు ఉంచినప్పుడు భారతదేశం మాత్రమే ఆ ఓటింగ్‌కు దూరంగా ఉంది. ఐఎంఎఫ్ నిర్ణయాన్ని వ్యతిరేకించడానికే భారతదేశం ఈ నిర్ణయం తీసుకుందని ప్రభుత్వ వర్గాలు పేర్కొంటున్నాయి. పాకిస్థాన్‌కు ఐఎంఎఫ్ కింద ఇవ్వదలచిన 700 కోట్ల డాలర్లలో 100 కోట్ల డాలర్ల విడుదల, కొత్త అప్పు కింద మరో 130 కోట్ల డాలర్లు.. మొత్తం కలిపి 230 కోట్ల డాలర్ల రుణం ఇచ్చే ప్రతిపాదనలను పరిశీలించేందుకు ఐఎంఎఫ్ శుక్రవారం బోర్డు మీటింగ్ నిర్వహించింది. కానీ, పాక్ అప్పు ఇచ్చే విషయంలో ఓటింగ్‌కు దూరంగా ఉండటం ద్వారా భారతదేశం తీవ్ర అసమ్మతిని వ్యక్తం చేసింది. అధికారికంగా తీవ్ర అభ్యంతరాలను వ్యక్తం చేసింది. గత 35 ఏళ్లలో 28 సార్లు పాక్ అంతర్జాతీయ ద్రవ్యనిధి నుంచి రుణాలు తీసుకుందని, గడిచిన ఐదేళ్లలో నాలుగు ఐఎంఎఫ్ ప్రోగ్రామ్‌లు పాక్‌లో అమలయ్యాయని గుర్తుచేసింది. కానీ, ఆ రుణాలు ఇచ్చే సమయంలో ఐఎంఎఫ్ పెట్టే షరతులకు కట్టుబడి ఉండడంలో, వాటిని అమలు చేయడంలో మాత్రం పాక్‌కు ఎప్పుడు కట్టుబడి లేదని, ఈ విషయాల్లో పాక్‌కు ఎక్కడా మంచి రికార్డు లేదని భారత్ ధ్వజమెత్తింది. గతంలో తీసుకున్న అప్పులను పాక్ సక్రమంగా వినియోగించులేదని ఆరోపించింది. ఐఎంఎఫ్ నుంచి నిధులు వస్తూ ఉంటే.. పాక్ వాటిని సైన్యానికి, ప్రభుత్వ ప్రాయోజిత సీమాంతర ఉగ్రవాదుల కోసం వినియోగిస్తుందని భారత్ ధ్వజమెత్తింది. ఆ నిధులను పాక్ సక్రమంగా వినియోగించి ఉంటే ఆ దేశ ఆర్థిక వ్యవస్థ స్థిరంగా ఉండేదని చెప్పుకొచ్చింది భారత్.



# మే 15 వరకు పౌర విమానాల రాకపోకలపై ఆంక్షలు..

ఆపరేషన్ సిందూర్ కింద పాకిస్తాన్‌పై కొనసాగుతున్న చర్యల మధ్య భారత ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది . దేశవ్యాప్తంగా 32 విమానాశ్రయాలను గురువారం (మే 15) ఉదయం 5:29 గంటల వరకు మూసివేయాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశించింది. పాకిస్తాన్ చేస్తున్న క్షిపణి, డ్రోన్ దాడులను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొంది. ఆపరేషన్ సిందూర్ కింద పాకిస్తాన్‌పై కొనసాగుతున్న చర్యల మధ్య భారత ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది . దేశవ్యాప్తంగా 32 విమానాశ్రయాలను గురువారం (మే 15) ఉదయం 5:29 గంటల వరకు మూసివేయాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశించింది. పాకిస్తాన్ చేస్తున్న క్షిపణి, డ్రోన్ దాడులను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొంది. అయితే, దేశవ్యాప్తంగా 24 విమానాశ్రయాలలో విమాన కార్యకలాపాలు శనివారం (మే 10) వరకు మూసివేస్తున్నట్లు పౌర విమానయాన మంత్రిత్వ శాఖ గురువారం (మే 8) ప్రకటించింది. కానీ పాకిస్తాన్ నుండి నిరంతర దాడులు జరిగిన తరువాత, కేంద్ర ప్రభుత్వం తేదీని పొడిగిస్తూ నిర్ణయం తీసుకుంది. మే 15 వరకు కేంద్ర ప్రభుత్వం మూసివేయాలని నిర్ణయించిన 24 విమానాశ్రయాలలో చండీగఢ్, శ్రీనగర్, అమృత్సర్, లూథియానా, భుంటార్, కిషన్‌గఢ్, పాటియాలా, సిమ్లా, జైసల్మేర్, పఠాన్‌కోట్ , జమ్మూ, బికనీర్, లేహ్, పోర్‌బందర్ సహా అనేక ఇతర విమానాశ్రయాలు ఉన్నాయి. ఈ విమానాశ్రయాలన్నీ భారతదేశంపాకిస్తాన్ సరిహద్దుకు సమీపంలో ఉన్న నగరాల్లో ఉన్నాయి. ప్రస్తుత పరిస్థితిలో, భద్రత దృష్ట్యా ఇవన్నీ మూసివేయడం జరుగుతుందని కేంద్ర ప్రభుత్వం తెలిపింది.భారతదేశంపాకిస్తాన్ మధ్య కొనసాగుతున్న వివాదం దృష్ట్యా, అనేక విమానయాన సంస్థలు ప్రయాణీకులకు ప్రయాణ సలహాను జారీ చేశాయి. విమానాశ్రయ మూసివేతలు, పెరిగిన భద్రతా ప్రోటోకాల్‌ల గురించి ప్రయాణీకులు తమను తాము అప్‌డేట్ చేసుకోవాలని కోరుతూ కంపెనీలు సలహాలు జారీ చేశాయి. ఎయిర్ ఇండియా శుక్రవారం (మే 9) సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌శ పోస్ట్‌ను షేర్ చేసింది. ''విమానయాన అధికారులు జారీ చేసిన నోటిఫికేషన్ ప్రకారం, దేశవ్యాప్తంగా అనేక విమానాశ్రయాల మూసివేత ప్రస్తుతానికి కొనసాగుతుంది. ఇంతలో, జమ్మూ, శ్రీనగర్, లేహ్, జోధ్‌పూర్, అమృత్సర్, చండీగఢ్, భుజ్, జామ్‌నగర్, రాజ్‌కోట్‌లకు బయలుదేరే అన్ని విమానాలు గురువారం (మే 15) ఉదయం 5:29 గంటల వరకు రద్దు చేయబడ్డాయి'' అని ఎయిర్‌లైన్ కంపెనీ పోస్ట్‌లో రాసింది. ''ప్రస్తుత సమయంలో, ప్రయాణానికి చెల్లుబాటు అయ్యే టిక్కెట్లను కలిగి ఉన్న వినియోగదారులందరికీ ప్రయాణ మార్పు లేదా టికెట్ రద్దుపై పూర్తి వాపసు విషయంలో ధరపై ఒకేసారి తగ్గింపు ఇవ్వడం జరుగుతుంది'' అని కంపెనీ పేర్కొంది.




# ఎఫ్ఎంసిజి అమ్మకాల్లో మందగమనం

రోజువారి అవసరాల కోసం అత్యంత ఎక్కువగా ఉపయోగించే ఎఫ్ఎంసిజి అమ్మకాలు మందగించాయి. ప్రస్తుత ఏడాది మార్చితో ముగిసిన త్రైమాసికంలో వీటి విక్రయాలు ఏకంగా 5.1 శాతం క్షీణించాయని నీల్సన్‌ఐక్యూ ఓ రిపోర్ట్‌లో వెల్లడిరచింది. పానియాలు, కస్మోటిక్స్, ప్యాకేజింగ్ ఫుడ్, క్లీనింగ్ ఉత్పత్తులు, పెన్నులు, పెన్సిళ్లు తదితర ఉత్పత్తులు ఎఫ్ఎంసిజి రంగంలోకి వస్తాయి. తక్కువ విలువ కలిగి ఎక్కువగా అమ్ముడయ్యే ఈ ఉత్పత్తుల అమ్మకాలు 2024 ఇదే మార్చి త్రైమాసికంలో 6.1 శాతం వృద్ధిని సాధించాయి. గడిచిన ఐదు త్రైమాసికాల నుంచి వీటి వృద్ధి సన్నగిల్లిందని నీల్సన్ రిపోర్ట్ పేర్కొంది. గ్రామీణ మార్కెట్ పట్టణ మార్కెట్ కంటే వేగంగా వద్ధి చెందుతూనే ఉంది. ఈ మార్కెట్ పట్టణాల కంటే గ్రామీణంలో ఎక్కువగా పెరుగుతున్నప్పటికీ గ్రామీణ ప్రాంతాల్లోనూ అమ్మకాలు అంతంత మాత్రంగానే నమోదయ్యాయి.''2024 తొలి త్రైమాసికంలోని డిమాండ్‌తో పోల్చితే 2025 ప్రథమ త్రైమాసికంలో గ్రామీణ వినియోగదారుల డిమాండ్ స్వల్పంగా పెరిగింది. పట్టణ మార్కెట్లతో పోల్చితే గ్రామీణ మార్కెట్లే మెరుగ్గా ఉన్నాయి. ముఖ్యంగా ద్రవ్యోల్బణం పెరుగుదల, మార్కెట్లలో మార్పుల వల్ల చిన్న సంస్థలు, అన్‌బ్రాండెడ్ సంస్థలు రెండంకెల వృద్ధిని నమోదు చేశాయి. ఏడాదికేడాదితో పోల్చితే గడిచిన మార్చి త్రైమాసికంలో అహార వినియోగ వృద్ధి 6 శాతం నుంచి 4.9 శాతానికి పడిపోయింది. గృహ, వ్యక్తిగత సంరక్షణ విభాగం అమ్మకాల్లో 5.7 శాతం పెరుగుదల చోటు చేసకుంది. అయితే.. గతేడాది మార్చి త్రైమాసికంలో 10.8 శాతం వృద్ధితో పోల్చితే చాలా తక్కువ.'' అని నీల్సన్‌ఐక్యూ రిపోర్ట్ పేర్కొంది.

# వ్యాపారంలో విజయానికి పంచతంత్రం.. వారెన్ బఫెట్ చెప్పిన ఐదు సూత్రాలు



ప్రతి ఒక్కరూ తాము ఉన్నత స్థాయికి ఎదగాలని, డబ్బులు బాగా సంపాదించాలని, వ్యాపారంలో ప్రగతి సాధించాలని కోరుకుంటారు. ఆ లక్ష్యాలను నెరవేర్చుకోవడానికి రేయింబవళ్లు కష్టబడతారు. వారిలో కొందరు విజయతీరాలకు చేరుకుంటారు. మరికొందరు మధ్యలోనే ఆగిపోతారు. ఏదైనా అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవడానికి క్రమశిక్షణ, ఓర్పు, సహనం, ముందు చూపు అవసరం. మన కళ్ల ముందే విజయాలు సాధించిన వ్యక్తులు మనకు ఆదర్శంగా నిలుస్తారు. వారిలో అమెరికాకు చెందిన వ్యాపారవేత్త వారెన్ బఫెట్ ఒకరు. ఆయన పెట్టుబడి దారుడు, పరోపకారి, బెర్క్ షైర్ హాత్ వే కంపెనీ చైర్మన్. ప్రపంచంలోని అత్యంత ధనవంతుల్లో ఒకరు. మంచి పెట్టుబడులు పెట్టాలంటే తెలుసుకోవాల్సిన ఐదు విషయాలను ఆయన వెల్లడిరచారు. మూలధనాన్ని రక్షించుకోవడం పెట్టుబడిదారుల ప్రధాన బాధ్యతని బఫెట్ తెలిపారు. డబ్బును పోగొట్టుకుంటే మీరు రేసులో వెనుకబడిపోతారు. దాని నుంచి కోలుకోవడం కష్టంగా మారుతుంది. ఒక స్టాక్ లో 50 శాతం నష్టపోతే, మరో దానిలో లాభాలు సంపాదించాలి. ముఖ్యంగా పెట్టుబడిలో నష్టాలను నివారించడానికి కష్టబడి పని చేయడమే సరైన మార్గమని ఆయన నమ్మకం. ఎక్కువ డబ్బులు పెట్టి ఒక మంచి కంపెనీని కొనడం కంటే, తక్కువ డబ్బులతో మధ్యస్త కంపెనీ కొనడం ఉత్తమమని బఫెట్ చెబుతారు. దీని వల్ల తక్కువ ధరకు నాణ్యత కలిగిన కంపెనీలో పెట్టుబడి పెట్టే అవకాశం కలుగుతుంది. ఇది వ్యాపార రంగంలో పెద్ద మార్పును తీసుకువస్తుంది. దీర్ఘకాలంలో లాభాల బాటలో పయనించే అవకాశం కలుగుతుంది. భావోద్వేగాలను దూరంగా ఉండడం పెట్టుబడి దారుడి ప్రధాన లక్షణం. దీనినే బఫెట్ వ్యతిరేక పెట్టుబడి కళగా అభివర్ణించారు. మార్కెట్ బాగున్నప్పుడు ధరలు పెరుగుతాయి. దీని వల్ల నష్టాలు కలుగుతాయి. అయితే భయాందోళనలు తలెత్తినప్పుడు స్టాక్ ల ధరల తగ్గే అవకాశం ఉంది. ఆ సమయంలో మంచి డీల్ లను అందుకోవచ్చు. పెట్టుబడిదారుడికి ఓర్పు అనేది ఛ్హాలా అవసరం. పెట్టుబడి పెట్టిన వెంటనే లాభాల కోసం ఆలోచించడం సరి కాదు. మంచి కంపెనీలో ఏళ్ల తరబడి డబ్బులను నిల్వ ఉంచాలి. అసహనంగా ఉండే వారు తరచూ అధిక ధరలకు స్టాక్ లను కొనుగోలు చేసి, మార్కెట్లు పెరిగినప్పుడు తక్కువ ధరకు అమ్మేస్తారు. తద్వారా ఓపికతో వేచి ఉండే ఇన్వెస్టర్లు లాభాలు పొందుతారు. డబ్బులను సంపాదించడానికి నిరంతరం కొత్త మార్గాలను అన్వేషించాలి. ఒక రకంగా చెప్పాలంటే నిద్ర పోతున్నప్పుడు కూడా డబ్బు సంపాదించడానికి మార్గం ఆలోచించాలి. లేకపోతే మీరు చనిపోయే వరకూ పని చేస్తూనే ఉంటారని వారెన్ బఫెట్ చెప్పారు. అంటే స్టాక్ లు, డివిడెంట్లు, మ్యూచువల్ ఫండ్స్ లో డబ్బులను ఇన్వెస్ట్ చేయాలి. మీరు నిద్రపోతున్నప్పుడు కూడా అవి పెరుగుతూనే ఉంటాయి. కొత్త మార్గాలను అన్వేషించడం పెట్టుబడి దారుడికి చాలా అవసరం.



# పాకిస్థాన్‌లో చమురు సంక్షోభం.. రాజధానిలో పెట్రోల్ బంకులు క్లోజ్..

భారత్ దాడితో కుదేలవుతున్న పాక్‌ను ఇప్పుడు చమురు కొరత వేధిస్తోంది. ఇస్లామాబాద్ రాజధాని టెరిటరీ అడ్మినిస్ట్రేషన్ రాజధాని నగరంలోని అన్ని పెట్రోల్, డీజిల్ ఫిల్లింగ్ స్టేషన్లను రాబోయే 48 గంటల పాటు పూర్తిగా మూసివేయాలని తక్షణ ఉత్తర్వు జారీ చేసింది. భారత వైమానిక దాడులతో ఉక్కిరిబిక్కిరి అవుతోన్న పాక్‌కు మరో సంక్షోభం వచ్చిపడిరది. భారత్ దాడితో కుదేలవుతున్న పాక్‌ను ఇప్పుడు చమురు కొరత వేధిస్తోంది. ఇస్లామాబాద్ రాజధాని టెరిటరీ అడ్మినిస్ట్రేషన్ రాజధాని నగరంలోని అన్ని పెట్రోల్, డీజిల్ ఫిల్లింగ్ స్టేషన్లను రాబోయే 48 గంటల పాటు పూర్తిగా మూసివేయాలని తక్షణ ఉత్తర్వు జారీ చేసింది. శనివారం ఉదయం 6 గంటల నుంచి 48 గంటల పాటు ఇస్లామాబాద్‌లోని అన్ని పెట్రోల్ బంకులను మూసివేస్తున్నట్టుగా అక్కడి ప్రభుత్వం ప్రకటించింది. అయితే, పెట్రోల్ బంకులు మూసి వేయడానికి గల కారణాలు ఏంటనే విషయంపై స్పష్టమైన వివరాలు మాత్రం తెలిసి రాలేదు. కాగా, పాక్‌లోని 4 ఎయిర్ బేస్‌లపై భారత్ దాడి చేసింది. దీంతో ఇరుదేశాల మధ్య ఉద్రిక్తతలు తీవ్రతరమయ్యాయి.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక


# కొత్త కబుర్లు పంచుకున్న న్యాచురల్ స్టార్



హిట్ 3 ది థర్డ్ కేస్ మొదటి వారంలోనే వంద కోట్ల గ్రాస్ దాటేసి విజయవంతంగా రెండో వారంలోకి అడుగు పెట్టేసింది. ఇండో పాక్ సరిహద్దుల్లో ఏర్పడిన యుద్ధ వాతావరణం వల్ల సినీ సెలబ్రిటీలు వీలైనంత ఈవెంట్లు లేకుండా చూసుకుంటున్నారు కానీ న్యాచురల్ స్టార్ నాని ఈ రోజు హిట్ 3 సక్సెస్ మీట్ పెట్టి ఇలా చేయడం వెనుక ఉద్దేశంతో పాటు కొత్త కబుర్లు పంచుకున్నాడు. పాకిస్థాన్ కు చాలా పద్ధతిగా ఇండియన్ ఆర్మీ బుద్ధి చెబుతోందని, శత్రుదేశం వల్ల ఒక భారతీయ సినిమా సెలబ్రేషన్ చేయలేదనే కారణం వాళ్లకు ఇవ్వకూడదనే ఉద్దేశంతోనే టీమ్ అందరితో డిస్కస్ చేసి ఇది ఏర్పాటు చేసినట్టు వివరించాడు. ఇక విశేషాల వైపు చూస్తే హిట్ 4లో ఏసిపి వీరప్పన్ గా చేయబోతున్న కార్తీతో ఏదో పెద్దదే ప్లాన్ చేస్తున్నాడు నాని. ఇంకా సినిమా చూడాల్సిన వాళ్ళు చాలా ఉన్నారు కాబట్టి ఎక్కువ డీటెయిల్స్ రివీల్ చేయలేదు. మిక్కీ జె మేయర్ ని తీసుకోవడం గురించి కామెంట్స్ వచ్చాయని, ఇలాంటి క్రైమ్ థ్రిల్లర్స్ కి అతను ఎలా న్యాయం చేస్తాడని అన్నారని, కానీ ఇలాంటి వాటికి గతంలో పని చేసిన వాళ్ళను కాకుండా ఒక ఫ్రెష్ సౌండ్ కోసం మిక్కీని తీసుకొచ్చామని, అది ప్పుడు మంచి ఫలితాన్ని ఇచ్చిందని ఆనందం వ్యక్తం చేశాడు. శైలేష్ కొలనుతో కామెడీ సినిమా ఉండొచ్చని, కాకపోతే ఎప్పుడనేది చెప్పలేనని అన్నాడు. ఈ వీకెండ్ కి హిట్ 3కి కీలకం కానుంది. కొత్త రిలీజులు సింగిల్, శుభంకు డీసెంట్ టాక్ వచ్చినప్పటికీ అవి మాస్ ని టార్గెట్ చేసినవి కాకపోవడంతో నానికి మరో ఛాన్స్ దక్కింది. ఎలాగూ ఆడియన్స్ కి ఎక్కువ ఆప్షన్స్ లేవు. బుకింగ్స్ మళ్ళీ ఊపందుకున్న వైనం బుక్ మై షోలో కనిపిస్తోంది. దీన్ని ఇంకాస్త బలంగా పుష్ చేసే ఉద్దేశంతో నాని విజయోత్సవం చేసుకున్నాడు.

# వైవీఎస్.. మళ్లీ వచ్చారు



టాలీవుడ్లో ఒకప్పుడు మాంచి క్రేజ్ సంపాదించుకున్న దర్శకుల్లో వైవీఎస్ చౌదరి ఒకరు. లాహిరి లాహిరి లాహిరిలో, సీతయ్య, దేవదాసు చిత్రాలతో ఒక దశలో ఆయన ఊపు మీదున్నారు. కానీ 'ఒక్క మగాడు' తర్వాత ఆయన కెరీర్ తిరగబడిరది. దాంతో మొదలుకుని వరుసగా డిజాస్టర్లు ఇచ్చి అడ్రస్ లేకుండా పోయారు. 'రేయ్' తర్వాత చాలా ఏళ్ల పాటు చౌదరి కనిపించలేదు. ఇక మళ్లీ ఆయన ఓ సినిమా చేయడం కష్టమే అనుకున్నారంతా. కానీ గత ఏడాది నందమూరి జానకిరామ్ తనయుడు కొత్త ఎన్టీఆర్‌ను హీరోగా పరిచయం చేయబోతున్నట్లు ప్రకటించి మళ్లీ వార్తల్లోకి వచ్చారు. రెండు మూడు నెలల పాటు ఈ సినిమా గురించి వరుసగా అప్‌డేట్స్ ఇస్తూ బాగానే హంగామా చేశారు చౌదరి.హీరోగా పరిచయమవుతున్న ఎన్టీఆర్, హీరోయిన్‌గా ఎంట్రీ ఇస్తున్న వీణారావుల కు సంబంధించి ఇంట్రో వీడియోలు ఆకట్టుకున్నాయి. కీరవాణి, చంద్రబోస్, సాయిమాధవ్ బుర్రా లాంటి టాప్ టెక్నీషియన్లను ఈ సినిమాకు ఎంచుకున్నారాయన. ఐతే ఇలా వరుసగా అప్‌డేట్స్ ఇస్తూ తన రీఎంట్రీ మూవీని వార్తల్లో నిలబెట్టిన చౌదరి.. ఆ తర్వాత ఉన్నట్లుండి సైలెంట్ అయిపోయారు. ఈ సినిమా ఎప్పుడు మొదలవుతుందో చెప్పలేదు. షూటింగ్, రిలీజ్ గురించి అప్‌డేట్స్ లేవు. సైలెంటుగా షూటింగ్ చేస్తున్నారా అన్న దానిపైనా స్పష్టత లేదు. దీంతో సినిమా ముందుకు కదులుతుందా.. ఆగిపోతుందా అన్న సందేహాలు కలిగాయి. ఐతే ఎట్టకేలకు చౌదరి కొత్త అప్‌డేట్‌తో రెడీ అయ్యారు. మే 12న ఈ సినిమా ప్రారంభోత్సవాన్ని ఘనంగా నిర్వహించబోతున్నారు. ఇందుకోసం ఒక విశిష్ఠ అతిథిని తీసుకొస్తున్నారు.

# మహాభారతం పేరుతో మార్కెటింగ్ చేస్తున్నారా



ఈ మధ్య అమీర్ ఖాన్ ఇంటర్వ్యూలలో మహాభారతం ప్రస్తావన ఎక్కువగా వస్తోంది. ఇది తన డ్రీం ప్రాజెక్ట్ అంటూ త్వరలోనే స్క్రిప్ట్ పనులు మొదలుపెడతానంటూ పదే పదే చెప్పుకోవడం మీడియాలో హైలైట్ అవుతోంది. ముందు కర్ణుడి పాత్రను ఆధారంగా చేసుకుని దాన్ని హైలైట్ చేస్తామని అన్నారు. తాజాగా కృష్ణుడి క్యారెక్టర్ తనకు ఎంతో ఇష్టమని, ఎంతో స్ఫూర్తినిస్తుందని మరో చోట చెప్పారు. ఇలా తరచు మాటలు మారుస్తున్న అమీర్ భాయ్ నిజంగా అంత గ్రాండ్ స్కేల్ మీద భారతాన్ని తెరకెక్కిస్తాడా అనేది వేయి డాలర్ల ప్రశ్న. కొంచెం లోతుగా ఆలోచిస్తే ఇతరత్రా కారణాలు కనిపిస్తున్నాయి. జూన్ 20 విడుదల కాబోతున్న సితారే జమీన్ పర్ మీద అమీర్ ఖాన్ కు బోలెడు ఆశలున్నాయి. తన పూర్వ వైభవాన్ని తీసుకొచ్చే సినిమా అవుతుందని గంపెడు నమ్మకంతో ఉన్నాడు. ఆర్ఎస్ ప్రసన్న దర్శకత్వం వహించిన ఈ యూత్ ఎమోషనల్ ఎంటర్ టైనర్ కి మంచి బజ్ ఉంది కానీ మరీ భీభత్సంగా అయితే లేదు. లాల్ సింగ్ చద్దా కొట్టిన దెబ్బకు అమీర్ ఇమేజ్ ప్లస్ మార్కెట్ లెక్కల్లో కొన్ని మార్పులు వచ్చాయి. అందులోనూ సితారే జమీన్ పర్ మాస్ ఆడియన్స్ ని ఆకర్షించే కమర్షియల్ సబ్జెక్టు కాదు. సో ఓపెనింగ్స్ తో మొదలుపెట్టి టాక్ దాకా ఎన్నో అంశాలు బాక్సాఫీస్ రన్ ని ప్రభావితం చేయబోతున్నాయి. ఇదంతా దృష్టిలో పెట్టుకునే మహాభారతం టాపిక్ తీసుకురావడం ద్వారా జనాల అటెన్షన్ తనమీదకు వచ్చేలా అమీర్ ఖాన్ చేసుకుంటున్నాడనేది ఒక బాలీవుడ్ వర్గం విశ్లేషణ. దీన్ని పూర్తిగా కొట్టిపారేయలేం.



# 'థగ్‌లైఫ్' ఆడియో వేడుక వాయిదా

కథానాయకుడు కమల్‌హాసన్ ప్రధాన పాత్రలో ప్రముఖ దర్శకుడు మణిరత్నం తెరకెక్కిస్తున్న చిత్రం 'థగ్‌లైఫ్'. ఈనెల 16న ఈ సినిమా ఆడియో వేడుక చెన్నైలో జరగాల్సివుంది. భారత్‌పాకిస్తాన్ ఉద్రిక్తతల నేపథ్యంలో ఈ కార్యక్రమాన్ని వాయిదా వేస్తున్నట్లు కమల్‌హాసన్ ప్రకటించారు. సరిహద్దుల్లో ఉద్రిక్తతల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన తెలిపారు. 'ఆర్ట్ కెన్ వెయిట్ %ా% ఇండియా కమ్స్ ఫస్ట్' అనే శీర్షికతో ఒక ప్రకటన విడుదల చేశారు. 'మన దేశ సరిహద్దులో జరుగుతున్న పరిణామాలు, ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా మే 16న జరగాల్సిన 'థగ్‌లైఫ్' ఆడియో విడుదలను వాయిదా వేస్తున్నాం. తిరిగి షెడ్యూల్ వివరాలను తెలుపుతాం. మన సైనికులు మన మాతృభూమి పరిరక్షణలో అంచంచలమైన ధైర్యంతో ముందు వరుసలో ఉండి పోరాటం చేస్తున్నారు. ఇది నిశ్శబ్ద సంఘీభావం కోసం నిర్ణయం తీసుకుంటున్నాం. వేడుకలకు ఇది సరైన సమయం కాదని నేను నమ్ముతున్నా. కొత్త తేదీని త్వరలో ప్రకటిస్తాం' అని ఆయన పేర్కొన్నారు. 'నాయగన్' (1987) వంటి హిట్ మూవీ తర్వాత 38 సంవత్సరాలకు మళ్లీ కమల్‌హాసన్‌మణిరత్నం కాంబినేషన్‌లో 'థగ్‌లైఫ్' సినిమా రానుంది. శింబు, త్రిష, అశోక్ సెల్వన్, ఐశ్వర్యాలక్ష్మి, జోజు జార్జ్, అభిరామి, నాజర్ ప్రధాన పాత్రల్లో నటించారు. ఉదయనిధి స్టాలిన్, ఆర్.మహేంద్రన్‌బీ శివ అనంత్ భారీ బడ్జెట్‌తో నిర్మించిన నిర్మించిన ఈ సినిమా జూన్ 5న విడుదల కానుంది. ఎఆర్ రెహమాన్ సంగీత దర్శకుడిగా, రవి కె చంద్రన్ ఛాయాగ్రాహకుడిగా వ్యవహరిస్తున్నారు.

# కృష్ణవంశీ ఫటాఫట్ ఆన్సర్స్



టాలీవుడ్ లెజెండరీ డైరెక్టర్లలో ఒకడైన కృష్ణవంశీ.. సోషల్ మీడియాలో చాలా యాక్టివ్ అన్న సంగతి తెలిసిందే. ఆయన తరం దర్శకుల్లో ట్విటర్ వాడేవాళ్లు తక్కువ. తర్వాతి తరం దర్శకులు ట్విట్టర్లో ఉన్నా అంత యాక్టివ్‌గా ఉండరు. కానీ కృష్ణవంశీ మాత్రం అభిమానులతో తరచుగా చిట్ చాట్లు చేస్తుంటారు. ఎవరైనా తనను ట్యాగ్ చేసి తన సినిమాల గురించి కామెంట్స్ చేసినా స్పందిస్తుంటారు. అనామకులకు, హార్ష్ కామెంట్లు చేసే వారికి కూడా ఆయన పద్ధతిగా సమాధానం ఇస్తుంటారు. తాజాగా కృష్ణవంశీ.. ట్విట్టర్ ఫ్యాన్స్‌తో చిట్ చాట్ చేశారు. అందులో వాళ్లు అడిగిన ప్రశ్నలకు ఫటాఫట్ ఆన్సర్లు ఇచ్చారు. ఎంతో ఆసక్తికరంగా సాగిన ఆయన చిట్ చాట్ విశేషాలు ఓసారి చూద్దాం. కృష్ణవంశీ కెరీర్లో 'ఖడ్గం' చాలా స్పెషల్ ఫిలిం. దానికి సీక్వెల్ తీస్తారా అని ఓ అభిమాని అడిగితే.. ''లేదండీ. అది సాధ్యం కాదు. క్షమించండి'' అనేశారు కృష్ణవంశీ. ఆయన సీక్వెల్స్, రీమేక్, ఫ్రాంఛైజీ సినిమాలకు పూర్తి వ్యతిరేకమని ఎప్పటికప్పుడు చెబుతూనే ఉంటారు. ఐతే మీరు రీమేక్ చేయాల్సి వ్తే 'నిన్నే పెళ్ళాడుతా'ను నాగచైతన్యతో రీమేక్ చేస్తారా అని.. అలాగే నాగచైతన్యఎన్టీఆర్‌లతో 'గుండమ్మ కథ' తీస్తారా అని అడిగితే.. ''మంచి ఆలోచనే. 150 కోట్లు తీసుకుని వచ్చేయండి. దుల్ల కొట్టేద్దాం'' అంటూ షార్ప్‌గా కామెంట్ చేశారు కృష్ణవంశీ. మరోవైపు చిరంజీవితో ఎప్పట్నుంచో చేయాలనుకుంటున్న సినిమా సంగతి ఏమైంది అని అడిగితే.. ''నాకు ఆ కోరిక ఉంది. ఎప్పట్నుంచో ఆయన్ని అడుగుతున్నాను. కానీ ఎందుకో కుదరడం లేదు. నా బ్యాడ్ లక్. ఐతే చిరంజీవితో 'రుద్రవీణ' లాంటి సినిమా తీసే సీన్ మాత్రం నాకు లేదు'' అని బదులిచ్చారు. చిరుతో ఆపద్బాంధవుడు లాంటి సినిమా తీయమని ఒక నెటిజన్ అడిగితే.. ఆ మాట చిరుకు మీరే చెప్పాలన్నారు కృష్ణవంశీ. జూనియర్ ఎన్టీఆర్‌తో 'రైతు' సినిమా ప్రపోజల్ ఏమైంది అని అడిగితే.. ''ఆయన ఇప్పుడు జూనియర్ కాదండీ. ఇంటర్నేషనల్ రేంజ్. నేను ఆయనతో సరిపోను'' అన్నారు.

# అత్తరు సాయిబు బయటకు వచ్చాడు



ఒక హిట్టు లేదా ఫ్లాపుని బట్టి డైరెక్టర్ సత్తాని అంచనా వేయలేం కానీ ఇప్పుడున్న పరిస్థితుల్లో హీరోలు ఇలాంటి విషయాల్లో ఒకటికి పదిసార్లు అలోచించి నిర్ణయాలు తీసుకుంటున్నారు. మంచు మనోజ్ దర్శకుడు శేఖర్ రెడ్డికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారనే వార్త అభిమానుల మధ్య చర్చకు దారి తెస్తోంది. కారణం అతను తీసిన రెండు సినిమాలు ఆడకపోవడమే. ఆరెక్స్ 100 ఫేమ్ కార్తికేయతో పెద్ద బడ్జెట్ పెట్టి 90 ఎంఎల్ తీస్తే ఫలితం దక్కలేదు. చిన్న పిల్లలను ప్రధాన పాత్రల్లో పెట్టి తీసిన హౌస్ అరెస్ట్ అసలు వచ్చిన సంగతే ఎవరికీ తెలియనంతగా ఫ్లాపయ్యింది. హనుమాన్ కన్నా ముందు నిర్మాత నిరంజన్ రెడ్డి తీసిన మూవీ ఇది.ఇప్పుడీ శేఖర్ రెడ్డికే మంచు మనోజ్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్టుగా తెలిసింది. అత్తరు సాయిబు టైటిల్ ని దాదాపుగా లాక్ చేశారట. మే 20 మనోజ్ పుట్టినరోజు సందర్భంగా దీన్ని లాంచ్ చేయాలనే ప్లానింగ్ జరుగుతోంది. సెలబ్రేషన్స్ గ్రాండ్ గా ఉండేలా చూస్తున్నారని తెలిసింది. ప్రాజెక్ట్ కన్ఫర్మని, ఫైనల్ నెరేషన్ ఈ వారంలోనే పూర్తయ్యాక అప్పుడు మీడియాకు చెప్పే ఆలోచనలో ఉన్నారట. ఈలోగా లీక్ రూపంలో బయటికి వచ్చేసింది. ఫుల్ ఎంటర్ టైనర్ గా రూపొందే అత్తరు సాయిబులో మనోజ్ బాడీ లాంగ్వేజ్, మ్యానరిజం డిఫరెంట్ గా ఉంటాయని అంటున్నారు. కామెడీ ప్రధానంగా ట్రీట్మెంట్ ఉంటుందని టాక్. వ్యక్తిగత సమస్యలు ఎన్ని ఉన్నా మనోజ్ వేగంగా సినిమాలు చేయాలని ఫ్యాన్స్ కోరుతున్నారు. భైరవం రిలీజ్ కు రెడీగా ఉంది. తేజ సజ్జ మిరాయ్ లో విలన్ గా నటించడం కొత్త బ్రేక్ ఇస్తుందని ఇప్పటికే టాక్ ఉంది.



# మీనమేషాలు లెక్కబెడుతున్న స్టారర్

చెప్పుకోదగ్గ క్యాస్టింగ్ ఉంది. విడుదల తేదీ ప్రకటిస్తే బిజినెస్ జరిగిపోతుంది. కానీ భైరవం టీమ్ మీనమేషాలు లెక్కబెడుతున్న తీరు ఆశ్చర్యం కలిగిస్తోంది. బెల్లంకొండ సాయిశ్రీనివాస్, మంచు మనోజ్, నారా రోహిత్ కలయికలో రూపొందిన ఈ విలేజ్ డ్రామాని మరీ ఆర్ఆర్ఆర్ రేంజ్ లో మల్టీస్టారర్ అనలేం కానీ మినీ స్టారరని చెప్పొచ్చు. ఆల్రెడీ ఒక పాట చార్ట్ బస్టర్ అయ్యింది. పోస్టర్లు, టీజర్ జనంలో ఆసక్తిని పెంచాయి. తమిళ సూపర్ హిట్ గరుడన్ రీమేక్ గా రూపొందిన భైరవంకు నాంది ఫేమ్ విజయ్ కనకమేడల దర్శకత్వం వహించారు. శంకర్ కూతురు అదితి శంకర్ టాలీవుడ్ కు హీరోయిన్ గా పరిచయమవుతోంది.అన్నీ బాగానే ఉన్నా ఎలాంటి చప్పుడు చేయకుండా భైరవం ఇంత మౌనంగా ఎందుకు ఉందనే సందేహం రావడం సహజం. మంచు విష్ణుతో ఉన్న విభేదాల దృష్ట్యా కన్నప్పకు పోటీగా ఈ సినిమాని రిలీజ్ చేయాలని మనోజ్ పట్టుబడుతున్నట్టుగా ఒక వెర్షన్ ఉంది. అదే నిజమైతే జూన్ 27 అని ప్రకటించేయాలి. కానీ అలా జరగలేదు. వాస్తవమేంటో టీమ్ కే తెలుసు. ఇంకో వైపు ఓటిటి డీల్ ఎంతకీ తెగకపోవడం వల్లే నిర్మాత డేట్ వేయలేకపోతున్నారని ఇన్ సైడ్ టాక్. ఆశించిన దానికన్నా తక్కువ మొత్తం ఆఫర్ చేయడం వల్ల వేచి చూసే ధోరణిలో ఉన్నట్టు చెబుతున్నారు. ఇప్పటికే డిలే వల్ల బజ్ తగ్గడం మొదలయ్యింది. చూస్తుంటే మేలో రావడం దాదాపు అసాధ్యమే. వచ్చే వారం స్లాట్ ఖాళీగా ఉన్నా భైరవం యూనిట్ నుంచి ఎలాంటి సౌండ్ లేదు. నెలాఖరులో 30న విజయ్ దేవరకొండ కింగ్ డమ్ ఉంది. ప్రస్తుతానికి వీళ్ళు అదే తేదీకి కట్టుబడ్డారు. ఒకవేళ పవన్ కళ్యాణ్ హరిహర వీరమల్లు వస్తే వాయిదా పడొచ్చు. అది కూడా ఇంకా తేలలేదు. జూన్ 20 కుబేర, సితారే జమీన్ పర్ ఉన్నాయి. ఆపై వారం 27 కన్నప్ప దిగుతాడు. అటుపై జూలైలో ఇంకా కష్టం. ఇంత స్పష్టంగా సమీకరణాలు కనిపిస్తుంటే భైరవం ఇంకా విడుదల తేదీ దోబూచులాడటం గమనార్హం. ఎక్కువ ఆలస్యం చేసినా ఉన్న బజ్ తగ్గిపోయే ప్రమాదముంది.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక




# ఐపిఎల్ వాయిదా : బిసిసిఐ

ఇండియన్ ప్రిమియర్ లీగ్ (ఐపిఎల్) సీజన్ 18 వారం రోజులు వాయిదా పడిరది. భారత్‌పాకిస్థాన్ దేశాల మధ్య ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో టోర్నీ నిర్వహణకు సంబంధించి కీలక నిర్ణయం తీసుకున్నారు. ఐపిఎల్ మిగిలిన మ్యాచ్‌లను వారం రోజుల పాటు నిలిపివేస్తున్నట్లు నిర్వాహకులు శుక్రవారం ప్రకటించారు. 'ప్రస్తుత పరిస్థితుల్లో అనేక ఫ్రాంఛైజీలు ఆటగాళ్ల భద్రతపై ఆందోళన వ్యక్తం చేశాయి. దీనిపై ఐపిఎల్ పాలక మండలిలో చర్చించాం. ప్రసారకర్తలు, స్పాన్సరర్లు, అభిమానుల అభిప్రాయాలను కూడా పరిగణనలోకి తీసుకున్నాం. మన సాయుధ బలగాల స్థైర్యం, సన్నద్ధతపై మాకు పూర్తి విశ్వాసం ఉన్నప్పటికీ.. అందరి అభిప్రాయాలను గౌరవించి ఈ నిర్ణయం తీసుకున్నాం' అని ఐపిఎల్ తమ 'ఎక్స్' ఖాతాలో రాసుకొచ్చింది. ఆటగాళ్ల భద్రత విషయంలో రాజీ పడకూడదనే ఉద్దేశంతో టోర్నీని కొంతకాలం వాయిదా వేసినట్లు బిసిసిఐ అధికారులు పేర్కొన్నారు. షెడ్యూల్ ప్రకారం శుక్రవారం లక్నో వేదికగా లక్నోబెంగళూరు జట్ల మధ్య ఏకనా స్టేడియంలో మ్యాచ్ జరగాల్సి ఉంది. ధర్మశాల వేదికగా ఢల్లీపంజాబ్ జట్ల మధ్య గురువారం జరగాల్సిన మ్యాచ్ కూడా అర్ధాంతరంగా నిలిపివేసిన విషయం తెలిసిందే. ఇక ఈ సీజన్‌లో ఇంకా 12 లీగ్ మ్యాచులు, రెండు క్వాలిఫయర్లు, ఒక ఎలిమినేటర్, మే 25న కోల్‌కతా వేదికగా ఫైనల్ మ్యాచ్ జరగాల్సి ఉన్నాయి. ఈ సీజన్‌లో ఇప్పటివరకు 57 లీగ్ మ్యాచ్‌లు పూర్తయ్యాయి. ఇంకా 16 మ్యాచ్‌లు జరగాల్సి ఉంది. ఐపిఎల్ టోర్నమెంట్‌ను వారం రోజులు వాయిదా వేయడాన్ని అన్ని ఫ్రాంచైజీలు మద్దతు తెలిపాయి. ఈ క్రమంలో సన్‌రైజర్స్ హైదరాబాద్ సహా పలు ఫ్రాంచైజీలు కీలక నిర్ణయం తీసుకున్నాయి. ఈ వారం రోజుల్లో జరిగే మ్యాచ్‌ల టికెట్ డబ్బులను వాపస్ ఇస్తామని ఆయా ఫ్రాంచైజీలు 'ఎక్స్' వేదికగా వెల్లడిరచాయి. మే 10న (శనివారం) ఉప్పల్ స్టేడియంలో కోల్‌కతా నైట్ రైడర్స్‌తో సన్‌రైజర్స్ హైదరాబాద్ తలపడాల్సి ఉంది. దీంతో ఆ మ్యాచ్ టికెట్లు కొన్నవాళ్లకు డబ్బులు రీఫండ్ చేస్తాం' అని ఆరెంజ్ ఆర్మీ తన పోస్ట్‌లో రాసుకొచ్చింది. అలాగే లక్నోబెంగళూరు మధ్య లక్నోలోని ఏక్నా స్టేడియంలో శుక్రవారం జరగాల్సిన మ్యాచ్‌కు సంబంధించి తిరిగి ఇచ్చేస్తామని ఆ ఫ్రాంచైజీ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపింది.

# సెమీస్‌కు ఆయుశ్, ఉన్నతి



తైపీ ఓపెన్ సూపర్300 బ్యాడ్మింటన్ టోర్నీ సెమీఫైనల్లోకి ఆయుశ్ శెట్టి, ఉన్నతి హుడా దూసుకెళ్లారు. శుక్రవారం జరిగిన పురుషుల సింగిల్స్‌లో ఆయుశ్ శెట్టి 1621, 2119, 2114తో బి.యంగ్ (కెనడా)పై చెమటోడ్చి నెగ్గాడు. ముఖ్యంగా రెండో గేమ్‌లో ఇరువురు షట్లర్లు ప్రతి పాయింట్ కోసం పోరాడారు. ఆ సెట్‌లో ఆయుశ్ చేజిక్కించుకొని.. మూడో గేమ్‌లో యంగ్‌కు ఆయుశ్ ముచ్చెమటలు పట్టించి ఆ గేమ్‌ను సునాయాసంగా చేజిక్కించుకున్నాడు. ఇక మహిళల సింగిల్స్‌లో ఉన్నతి ఉన్నతి హుడా కూడా సంచలనం నమోదు చేసింది. తనకంటే మెరుగైన ర్యాంక్‌లో ఉన్న తైపీకి చెందిన వై.యంగ్‌పై మూడుసెట్ల హోరాహోరీ పోరులో చిత్తు చేసింది. ఉత్కంఠభరితంగా సాగిన ఆ గేమ్‌లో ఉన్నతి 218తో తొలి గేమ్‌ను చేజిక్కించుకొని.. రెండో గేమ్‌లో పోరాటాపోటీగా తలపడి 1921తో ఆ సెట్‌ను కోల్పోయింది. ఇక నిర్ణయాత్మక మూడో గేమ్‌లో 2119తో చేజిక్కించుకొని సెమీస్‌కు చేరింది. సెమీస్‌లో ఉన్నతి జపాన్‌కు చెందిన మియాజాకితో తలపడనుంది.

# రికర్వులో సెమీస్‌కు దీపిక, పార్థ్



ఆర్చరీ ప్రపంచకప్ స్టేజ్2 వ్యక్తిగత విభాగాల్లో దీపిక కుమారి, పార్థ్ సలుంకే సెమీఫైనల్లోకి దూసుకెళ్లారు. శుక్రవారం జరిగిన మూడో రౌండ్ పోటీలో పార్థ్ మూడు సార్లు ఒలింపిక్ ఛాంపియన్ కొరియాకు చెందిన కిమ్ జెడియాక్‌ను చిత్తుచేశాడు. తొలిరౌండ్‌లో ఏకంగా మాజీ ఒలింపిక్, ప్రస్తుత ప్రపంచ ఛాంపియన్ మాటే గజోజ్ (టర్కీ)ను షూట్ ఆఫ్‌లో ఓడిరచిన పార్థ్%ా% ఆదివారం జరిగే వ్యక్తిగత సెమీస్‌లో పార్థ్ కొరియాకే చెందిన పారిస్ ఒలింపిక్స్ ఛాంపియన్ కిమ్ పూజిన్‌తో తలపడతాడు. ఇక మహిళల సింగిల్స్ క్వార్టర్‌ఫైనల్లో దీపిక కుమారి పారిస్ ఒలింపిక్స్ టీమ్ రజత పతక విజేత, చైనాకు చెందిన లీజియామన్‌పై 62తో విజయం సాధించింది. ఆదివారం జరిగే ఫైనల్లో దీపిక కుమారి ప్రస్తుత ఒలింపిక్ ఛాంపియన్, కొరియాకు చెందిన లిమ్‌సిహియోన్‌తో అమీ తుమీ తేల్చుకోనుంది. ఇక మిక్స్‌డ్ విభాగం సెమీఫైనల్లో అభిషేక్ వర్మమధుర ధమన్‌గోంకర్ 156 158పాయింట్ల తేడాతో బ్రిటన్ జంట చేతిలో ఓటమిపాలయ్యారు. శనివారం జరిగే కాంస్య పతక పోరులో వీరు మలేషియాకు చెందిన ఫాతిన్‌మహ్మద్ జువైదితో తలపడ నున్నారు. ఇక కాంపౌండ్ టీమ్ ఫైనల్లో భారత పురుషుల, మహిళల జట్లు ఫైనల్లో మెక్సికో తలపడనున్నాయి.

# ఐపిఎల్ వాయిదా

భారత్, పాకిస్థాన్ మధ్య కాల్పుల విరమణకు అంగీకారం కుదరడంతో ఐపీఎల్ పునరద్ధరణపై బీసీసీఐ దృష్టిపెట్టింది. రెండు దేశాల మధ్య ఉద్రిక్తతల కారణంగా ఐపీఎల్‌ను బోర్డు వారం రోజులు వాయిదా వేసిన సంగతి తెలిసిందే. పరిస్థితులు మారిన నేపథ్యంలో తిరిగి లీగ్ ప్రారంభించడంపై ఆదివారం చర్చించనున్నట్లు బీసీసీఐ ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా చెప్పాడు. ''యుద్ధం ఆగిపోయింది. బీసీసీఐ ఆఫీస్ బేరర్లు, అధికారులు, ఐపీఎల్ పాలకవర్గం ఆదివారం చర్చించి లీగ్‌పై ఓ నిర్ణయం తీసుకుంటారు. టోర్నీని పూర్తి చేయడానికి అత్యుత్తమ షెడ్యూలు ఏదో చూస్తాం'' అని అన్నాడు. బెంగళూరు, హైదరాబాద్, చెన్నై నగరాల్లో మిగిలిన మ్యాచ్‌లను నిర్వహించాలని అంతకుముందు వచ్చిన వార్తలపై శుక్లా స్పందిస్తూ.. ''అది యుద్ధం జరుగుతునప్పుడు అనుకున్నది. ఇంకా చాలా ప్రత్యామ్నాయాల గురించి మేం చర్చించాం. ఇప్పుడే కాల్పుల విరమణను ప్రకటించారు. మాకు కొంచెం సమయమివ్వండి. మేం చర్చిస్తాం. ఆ తర్వాతే నిర్ణయం తీసుకుంటాం'' అని చెప్పాడు. ఈ సీజన్ ఐపీఎల్‌లో ఇంకా 16 మ్యాచ్‌లు జరగాల్సివుంది. మేలోనే ఐపీఎల్‌ను పూర్తి చేయాలని బీసీసీఐ నిర్ణయిస్తే... విదేశీ ఆటగాళ్లను వెనక్కి రప్పించడం పెద్ద సవాలే. ఐపీఎల్ వెంటనే ఆరంభమైతే వెళ్లిపోయిన విదేశీ ఆటగాళ్లు తిరిగొస్తారన్న గ్యారెంటీ లేదు.




# టెస్ట్ క్రికెట్ కోహ్లీ గుడ్‌బై?

టీం ఇండియా రన్ మెషీన్, కింగ్ విరాట్ కోహ్లీ ఫ్యాన్స్‌కి షాకింగ్ న్యూస్. టీం ఇండియా త్వరలో ఇంగ్లండ్ పర్యటనకు వెళ్లనున్న విషయం తెలిసిందే. అక్కడ అతిధ్య జట్టుతో భారత్ ఐదు టెస్ట్ మ్యాచ్‌లు ఆడనుంది. అయితే ఇప్పటికే భారత జట్టుకు ఓ షాక్ తగిలింది. ఈ సిరీస్‌కి ముందే టెస్ట్ క్రికెట్ నుంచి రిటైర్ అవుతున్నట్లు హిట్‌మ్యాన్ రోహిత్ శర్మ ప్రకటించాడు. తాజాగా కింగ్ విరాట్ కోహ్లీ కూడా టెస్ట్‌ల నుంచి రిటైర్ అవ్వాలనే యోచనలో ఉన్నట్లు క్రికెట్ వర్గాల్లో వార్తలు వినిపిస్తున్నాయి. ఈ విషయాన్ని అతను బిసిసిఐతో చెప్పినట్లు సమాచారం. ఇంగ్లండ్ పర్యటన భారత జట్టుకు ఎంతో ప్రతిష్టాత్మకమైనది. ఇప్పటికే రోహిత్ శర్మ రిటైర్ అవ్వడం జట్టుపై తీవ్ర ప్రభావం చూపిస్తుంది. ఇప్పుడు విరాట్ కోహ్లీ కూడా టెస్ట్ క్రికెట్ నుంచి రిటైర్ అయితే జట్టు మిడిలార్డర్ చాలా బలహీనం అవుతుంది. దీంతో విరాట్ రిటైర్‌మెంట్ నిర్ణయం గురించి పునరాలోచించుకోవాలని బిసిసిఐ అతన్ని కోరినట్లు తెలుస్తోంది. అయితే దీనిపై ఎలాంటి అధికారిక ప్రకటన లేదు. మరి కోహ్లీ తన నిర్ణయాన్ని మార్చుకుంటాడో.. లేదో వేచి చూడాల్సిందే.

# భయాందోళనలో విదేశీ క్రికెటర్లు?



భారత్‌పాకిస్థాన్ దేశాల మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో ఐపిఎల్‌లో వివిధ జట్లకు ప్రాతినిథ్యం వహిస్తున్న విదేశీ క్రికెటర్లలో ఆందోళన నెలకొంది. దేశంలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని బిసిసిఐ ఇప్పటికే ఐపిఎల్‌ను వారం రోజుల పాటు వాయిదా వేసింది. ఇదిలావుంటే ఐపిఎల్‌లో ఆడేందుకు భారత్‌కు వచ్చిన విదేశీ క్రికెటర్లలో భయం వాతావరణం ఏర్పడిరది. ఎప్పుడూ ఏ జరుతుందోనని భయపడుతున్నారు. ఈ సీజన్‌లో ఆస్ట్రేలియాకు చెందని ఎక్కువ మంది క్రికెటర్లు వివిధ జట్ల తరుఫున ఆడుతున్నారు. ప్యాట్ కమిన్స్, హాజిల్‌వుడ్, ఆడమ్ జంపా, టిమ్ డేవిడ్, ట్రావిస్ హెడ్, స్టార్క్, స్టోయినిస్ తదితర ఆస్ట్రేలియా ఆటగాళ్లు వివిధ జట్లకు ప్రాతినిథ్యం వహిస్తున్నారు. అంతేగాక ఇంగ్లండ్, సౌతాఫ్రికా, వెస్టిండీస్, బంగ్లాదేశ్, అఫ్ఘానిస్థాన్, శ్రీలంక దేశాలకు చెందిన క్రికెటర్లు కూడా ఐపిఎల్‌లో ఆడుతున్నారు. ప్రస్తుతం వీరందరిలో భయం నెలకొంది. సాధ్యమైనంత త్వరగా స్వదేశానికి వెళ్లి పోవాలనే ఆలోచనలో వీరున్నట్టు తెలుస్తోంది. కాగా, బిసిసిఐ టోర్నమెంట్‌ను వారం రోజుల పాటు వాయిదా వేసిన నేపథ్యంలో విదేశీ క్రికెటర్లు తమ తమ దేశాలకు వెళ్లిపోతారా లేకుంటే భారత్‌లోనే ఉంటారా అనే దానిపై స్పష్టత రావడం లేదు.

# త్రివిధ దళాలకు క్రీడాకారుల సంఘీభావం!



అపరేషన్ సిందూర్ తర్వాత భారత్‌పాకిస్థాన్ దేశాల మధ్య ఉద్రిక్త వాతావరణం నెలకొన్న సంగతి తెలిసిందే. ఇరు దేశాల మధ్య తీవ్ర యుద్ధం జరుగుతున్న నేపథ్యంలో భారత క్రీడాలోకం త్రివిధ దళాలకు మద్దతుగా నిలిచింది. దేశ ప్రజల సంరక్షణ కోసం శ్రమిస్తున్న భద్రత దళాలకు పలువురు క్రీడాకారులు మద్దతుగా నిలిచారు. సైన్యం సేవలను కొనియాడుతూ పలువురు స్టార్ క్రీడాకారులు సోషల్ మీడియా వేదికగా పోస్టులు పెట్టారు. తామంతా సైన్యం వెంటే ఉన్నట్టు తెలిపారు. దేశ రక్షణ కోసం ప్రాణాలను సయితం లెక్క పెట్టకుండా సరిహద్దుల్లో పోరాడుతున్న మన సైనికులకు సెల్యూట్ అంటూ కోహ్లి పోస్ట్ చేశాడు. క్లిష్ట సమయంలో అనుక్షణం దేశాన్ని కంటికి రెప్పలా కాపాడుతున్న మన సైనికులకు అందరు మద్దతుగా నిలవాలని, వారిలో కొత్త ధైర్యాన్ని నింపాలని కోరాడు. దేశ సంరక్షణలో భాగంగా మన సైన్యం తీసుకునే ప్రతీ నిర్ణయాన్ని తాను గౌరవిస్తానని టీమిండియా స్టార్ క్రికెటర్ రోహిత్ శర్మ పేర్కొన్నాడు. మన దేశ గౌరవాన్ని పెంచడంలో సైనికులు ఎప్పుడూ ముందుంటారని వారి సేవలను కొనియాడాడు. మీ ధైర్యం, క్రమశిక్షణ, త్యాగమే జాతికి బలమని భారత బ్యాడ్మింటన్ స్టార్ పి.వి.సింధు పేర్కొంది. ఆపరేషన్ సిందూర్ వంటి పరిస్థితుల వేళ మన త్రివర్ణ పతకాన్ని ఎగురవేసిన మీ ధైర్యాన్ని, నిస్వార్ధ సేవలను ఎల్లవేళలా గుర్తుంచుకుంటామని సింధు తెలిపింది. వీరేంద్ర సెహ్వాగ్, హర్భజన్ సింగ్, సౌరభ్ గంగూలీ, కైఫ్, అశ్విన్, యువరాజ్, ఇర్ఫాన్ పఠాన్ తదితర క్రికెటర్లు సయితం సైనికులకు సెల్యూట్ చేస్తూ పోస్టులు పెట్టారు.

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in